నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 14-12-2023 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No.L1/HQ/SD/258/2021-2023 సంపుటి :30 సంచిక:107 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

కలత కల
మనసంత వికలం
తిమిర మాయ

ఓటమి పోటు
నాల్గేళ్లు నిరీక్షణ
కలలో కప్పు.

ధన ప్రవాహం
ఉచిత పథకాలు
ఖజానా ఖాళీ.

బురద గుంట
పండదుకదా పంట
కన్నీరు కంట.

ద్రోహ చింతన
తుదకు చితిబూది
ప్రేమే పెన్నిధి

– రేడియమ్
సెల్: 9291527757

నీనిజాలు

నడుమంత్రపు వేషాల్లా
ఇవాళ ఎవరు రేపెవరు ?
ఇలా చీకటి వెలుగులా
అలా వచ్చి పోవు 'పవరు' !.

హాస్పిటల్లో కలిసినారు
మాజీ ముఖ్యమంత్రులు !
కేసీఆర్ చంద్రబాబు
తెగిన వీణా తంత్రులు !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

లోక్ సభలో ఆగంతకులు.. టియర్ గ్యాస్‌తో అలజడి..

న్యూఢిల్లీ, డిసెంబర్ 13: లోక్‌సభలో భద్రతా వైఫల్యం బయటపడింది. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఇద్దరు ఆగంతకులు సభలోకి ప్రవేశించారు. విజిటర్స్ గ్యాలరీ నుంచి సభలోకి దూకిన ఆగంతకులు సభలో టియర్ గ్యాస్ ప్రయోగించారు. వారి షూ నుంచి పసుపు రంగు గ్యాస్ వెలువడింది. జీరో అవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది.

ఈ ఘటనలో ఒక్కసారిగా భయాందోళనకు గురైన ఎంపీలు సభనుంచి బయటకు పరుగులు తీశారు. అనూహ్య పరిణామంతో సభను స్పీకర్ ఓం బిర్లా వాయిదా వేశారు. రంగంలోకి దిగిన భద్రతా సిబ్బంది ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు నీలం, అమోల్ షిండేగా గుర్తించారు. కాగా, పార్లమెంట్ భవనంపై ఉగ్రదాడి జరిగి నేటికి 22 ఏళ్లు పూర్తైంది. ఈ నేపథ్యంలో సభలోకి ఆగంతకులు ప్రవేశించడం ప్రస్తుతం తీవ్ర కలకలం రేపుతోంది.

రెచ్చిపోయిన ఆగంతకులు!

లోక్‌సభలో భద్రతా వైఫల్యం పెను దుమారం రేపింది. లోక్‌సభలో బుధవారం జీరో అవర్ జరుగుతుండగా విజిటర్స్ గ్యాలరీ నుంచి ఇద్దరు అగంతకులు కిందకు దూకి గ్యాస్‌ను వదలడం కలకలం రేపింది. ఇద్దరు ఆగంతకులను నీలం, అమోల్ షిండే గా గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు.

ఈ ఘటనపై శివసేన (యూబీటీ) ఎంపీ అరవింద్ సావంత్ స్పందిస్తూ ఆగంతకుల దుశ్చర్యతో సభలో కలకలం రేగిందని, అయితే ఈ ఘటనలో ఎవరూ గాయపడలేదని చెప్పారు. ఆగంతకులు కిందకు దూకినప్పుడు చివరి బెంచీల్లో సభ్యులు ఎవరూ లేకపోవడంతో వారిని సులభంగా పట్టుకున్నారని అన్నారు. కాగా లోక్‌సభలో ఆగంతకులు గ్యాస్ వదలడం తీవ్ర భద్రతా వైఫల్యమని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం అన్నారు. సభ జరుగుతుండగా అనూహ్యంగా 20 ఏండ్ల వయసున్న ఇద్దరు వ్యక్తులు విజిటర్స్ గ్యాలరీ నుంచి సభలోకి దూకి పసుపు రంగు గ్యాస్‌ను వదిలారని చెప్పారు. వారు కొన్ని నినాదాలు చేశారని, వారు వదిలిన గ్యాస్ విష వాయువు కావచ్చని, ఇది తీవ్ర భద్రతా వైఫల్యమని కార్తీ చిదంబరం పేర్కొన్నారు. 2001లో డిసెంబర్ 13న పార్లమెంట్‌పై దాడి జరగ్గా సరిగ్గా ఇదే రోజు ఈ ఘటన జరగడం గర్హనీయమని, ఇది ముమ్మాటికీ భద్రతా వైఫల్యమేనని కార్తీ చిదంబరం వ్యాఖ్యానించారు.

సభలో వదిలిన పొగ హానికరమైంది కాదు:స్పీకర్ ఓం బిర్లా

న్యూఢిల్లీ,డిసెంబర్ 13:। లోక్‌సభలో భారీ భద్రతా వైఫల్యం బయటపడింది. ఇద్దరు ఆగంతకులు విజిటర్స్ గ్యాలరీ నుంచి సభలోకి దూకి కలర్ స్మోక్ వదలడం తీవ్ర కలకలం రేపింది. ఈ వ్యవహారంపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా స్పందించారు. ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించినట్లు తెలిపారు.

సభలో వారు (ఆగంతకులు) వదిలిన పొగ హానికరమైనది కాదని ప్రాథమిక దర్యాప్తులో తేలిందన్నారు. నిందితులు వదిలిన గ్యాస్ ఏమిటనే దానిపై విచారణ చేస్తున్నారన్నారు. విచారణ అనంతరం అన్ని విషయాలు తెలుస్తాయని చెప్పారు. ఎంపీల ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకూ ఇద్దరు చొరబాటుదారుల్ని అదుపులోకి తీసుకున్నామన్నారు. పార్లమెంట్ బయట మరో ఇద్దర్ని కూడా పోలీసులు పట్టుకున్నట్లు ఓం బిర్లా వివరించారు.

మరోవైపు భద్రతా వైఫల్యం ఘటనపై పోలీసులు విచారణ చేపడుతున్నారు. ఈ వ్యవహారంలో ఇప్పటి వరకూ పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ ఆగంతకుల్లో ఒకరైన సాగర్ శర్మ.. మైసూర్ బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహా విజిటర్ పాస్‌తో లోక్‌సభ విజిటర్స్ గ్యాలరీలోకి ప్రవేశించినట్లు నిర్ధారించారు. మరో ఆగంతకుడిని మైసూర్‌కు చెందిన మనోరంజన్ డీగా గుర్తించారు. అతను వృత్తిరీత్యా ఇంజినీర్ అని పోలీసులు తెలిపారు. హర్యానాకు చెందిన నీలమ్ (42) అనే మహిళతో పాటు మహారాష్ట్రకు చెందిన అమోల్ షిండే (25) పార్లమెంట్ బయట టియర్ గ్యాస్ ప్రయోగించినట్లు అధికారులు గుర్తించారు. ఈ పరిణామాల నేపథ్యంలో లోక్‌సభలో విజిటర్స్ పాసులపై స్పీకర్ ఓం బిర్లా నిషేధం విధించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు విజిటర్స్ పాస్‌లపై నిషేధం అమల్లో ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే ప్రసాద్ సమక్షంలో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు

హైదరాబాద్, డిసెంబర్ 13:మాజీ మంత్రి వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ సమక్షంలో వికార భగత్ మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్ ఆధ్వర్యంలో మున్సిపల్‌లో 31 చెందిన మాలే గాయత్రి లక్ష్మణ్ కాంగ్రెస్ పార్టీలో చేరారు.

బుధవారం ఉదయం గడ్డం ప్రసాద్ కుమార్ నివాసంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డిల ఆధ్వర్యంలో ఆమె కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, మాజీ వైస్ చైర్మన్ చిగుళపల్లి రమేష్, వికారాబాద్ పట్టణ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, నాయకులు దీపు లక్ష్మణ్, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు ఉన్నారు.

కస్తూరి నరేందర్ సమక్షంలో కాంగ్రెస్ లోకి చేరికలు



హైదరాబాద్, డిసెంబర్ 13:రాజేంద్రనగర్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే కస్తూరి నరేందర్ సమక్షంలో బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. శంషాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల్ అధ్యక్షులు గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో బహుదూర్ గూడ గ్రామానికి చెందిన బంగారు కుమార్ బృందం బీజేపీ, బీఆర్ఎస్ వార్డు సభ్యులు, 100 మంది కార్యకర్తల కాంగ్రెస్ లో చేరారు. వారికి కంటెస్టెడ్ ఎమ్మెల్యే కస్తూరి నరేందర్, రంగారెడ్డి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు చల్ల నర్సింహా రెడ్డి లు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు జెల్పల్లి నరేందర్, మున్సిపల్ అధ్యక్షులు సంజయ్ యాదవ్, రూరల్ ఉపాధ్యక్షులు రమేష్, పెద్దగోల్కొండ సర్పంచ్ లక్ష్మయ్య, నర్కుడ ఎంపీటీసీ గౌతమిఅశోక్, బొబ్బిలి శేఖర్, సులోచన జహంగీర్ బాయ్ మున్సిపల్ ఉపాధ్యక్షుడు, బహుదూర్ గూడ ఉపసర్పంచ్ ప్రభాకర్, జీవన్ గౌడ్, సంజయ్ రెడ్డి, కొత్త రాకేష్, శ్రీధర్, అక్రమ్ సంజు, వెంకట్ రెడ్డి, నాగార్జున యాదవ్, గణేష్, వెంకటేష్, నరసింహ, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పుల బాధతో దంపతులు ఆత్మహత్య

హైదరాబాద్, డిసెంబర్ 13:అప్పుల బాధతో దంపతులు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఏలూరు జిల్లాలో చోటుచేసుకుంది. బ్రతుకు తెరువు కోసం ఆక్వాకల్చర్‌పై ఆదారపడ్డ దంపతులకు అప్పులు ఎక్కువై తీవ్ర మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన ఏపీలోని ఏలూరు జిల్లాలో చోటు చేసుకుంది. జిల్లాకు చెంది నాగబాబు(30), అనూష(28) దంపతులు. ఇటీవల ఆక్వాసాగులో నష్టం రావడంతో అప్పుల పాలయ్యారు.దీంతో అప్పులు తీర్చలేక చనిపోతున్నట్లు ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఆక్వా సాగులో నష్టం వచ్చిందని, అప్పులు ఎక్కువ తాము ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్‌లో దంపతులు పేర్కొన్నారు.

సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

18న హైదరాబాద్‌కు రాష్ట్రపతి.. ఏర్పాట్లను సమీక్షించిన సీఎస్

హైదరాబాద్, డిసెంబర్ 13: శీతాకాల విడిది నేపథ్యంలో ఈ నెల 18న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హైదరాబాద్‌కు రానున్నారు. ఐదు రోజుల పాటు ఆమె బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో బస చేయనున్నారు. ఆమె తిరిగి 23వ తేదీన ఢిల్లీకి వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి.. రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు.ఆయా శాఖల అధికారులు సమన్వయం చేసుకోని, తగిన ఏర్పాట్లు చేయాలని సీఎస్ సూచించారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తగు చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు సీఎస్.ఈ సమీక్షా సమావేశానికి డీజీపీ రవి గుప్తా, స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్ శర్మ, జీఏడీ సెక్రటరీ శేషాద్రి, హెల్త్ సెక్రటరీ రిజ్వి, సీనియర్ పోలీసు అధికారులు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

కుంభమేళ .. సీఎంను భారీగా నిధులు కోరిన మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్, డిసెంబర్ 13:వచ్చే ఏడాది మేడారం కుంభమేళా – జాతర జరగనుంది.. లక్షలాదిగా తరలివచ్చే భక్తులను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే సౌకర్యాల పనులు ప్రారంభమయ్యాయి.. ఈ క్రమంలో దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ నేడు సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. మేడారం సమ్మక్క సారలమ్మ జాతర అభివృద్ధి పనుల గురించి చర్చించారు.

ఈ కుంభమేళా కోసం మౌలిక సదుపాయాల కల్పన, యాత్రికుల కోసం షాపింగ్ కాంప్లెక్స్, విశ్రాంతి గదులు, తాగునీటి నిర్మాణాలు, మండపం వంటి శాశ్వత సౌకర్యాలను ఏర్పాటు చేయడం కోసం నిధులు మంజూరు చేయాలని సీఎంను ఆమె కోరారు. శాశ్వత ప్రతిపాదికను నిర్మాణాలు చేపట్టాలని, వాటికోసం బడ్జెట్ లో భారీగా నిధులు మంజూరు చేయవాలని అభ్యర్థించారు. కాగా, ఈ పనులు చేపట్టేందుకు బడ్జెట్ మంజూరు కోసం శాఖల వారీగా ప్రతిపాదనలతో రావాలని కొండా సురేఖను రేవంత్ రెడ్డిని ఆమె కోరారు.

సిఎం ప్రమాణ స్వీకారోత్సవం.. ఎల్ ఈ డీలు పేల్చిన నక్సల్స్

రాయ్ పూర్, డిసెంబర్ 13: ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకారోత్సవం నేడు జరగునన్న సందర్భంగా దేశ ప్రధాని నరేంద్ర మోడీతో పాటు 6 రాష్ట్రాల ముఖ్యమంత్రులు, నలుగురు కేంద్ర మంత్రులు రాజధాని రాయ్‌పూర్‌కు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో నక్సలైట్లు పేలుళ్లకు పాల్పడ్డారు. ఇందులో ఛత్తీస్‌గఢ్ సాయుధ దళాలకు చెందిన ఒక సైనికుడు వీరమరణం పొందాడు. మరొక సైనికుడు గాయపడ్డాడు. నారాయణపూర్‌లోని ఛోటాదొంగర్‌లో సైనికుల సెర్చింగ్ సమయంలో ఈ ఘటన జరిగినట్లు చెబుతున్నారు. ఆ సమయంలో ఒక సైనికుడు ఎల్ ఈ డీ పేలుడు బారిన పడ్డాడు. 9వ కార్ప్స్‌కు చెందిన యువ కానిస్టేబుల్ కమలేష్ కుమార్ వీరమరణం పొందాడు. మరో కానిస్టేబుల్ వినయ్ కుమార్ కు స్వల్పగాయాలయ్యాయి..

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి అస్వస్థత.. దవాఖానలో చేరిక

హైదరాబాద్, డిసెంబర్ 13:రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అనారోగ్యంతో దవాఖానలో చేరారు. ఆయన కొన్ని రోజులుగా గొంతు నొప్పితో బాధపడుతున్నారు. ఆ తీవ్రత ఎక్కువ కావడంతో నిన్న ఢిల్లీ నుంచి తిరిగి రాగానే సోమాజిగూడలోని యశోద హాస్పటల్?లో చేరారు. మంత్రికి వైద్య పరీక్షలు చేసిన డాక్టర్లు.. రెండు రోజులు దవాఖానలోనే ఉండాలని సూచించారు. దీంతో ఆయన యశోద హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్నారు. కాగా, తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండ నుంచి ఎమ్మెల్యేగా గెలవడంతో.. ఆయన తాజాగా భువనగిరి ఎంపీ పదవికి రాజీనామా చేశారు.

మంత్రి త్వరగా కోలుకోవాలి

బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

హైదరాబాద్, డిసెంబర్ 13:అనారోగ్యం కారణంగా యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పరామర్శించారు. వెంకట్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మంత్రిత్వరగా కోలుకోవాలని ఎమ్మెల్సీ కవిత ఆకాంక్షించారు.

హైదరాబాద్‌ను మరో మెట్టు ఎక్కించాల్సిన బాధ్యత వాళ్లదే : కేటీఆర్

హైదరాబాద్, డిసెంబర్ 13:అంతర్జాతీయ సూచికలో హైదరాబాద్ మరోసారి సత్తా చాటింది. గత 10 ఏండ్లుగా స్థిరమైన పాలన, ప్రశాంత రాజకీయ వాతావరణం ఫలితంగా హైదరాబాద్ నగరంలో జీవన నాణ్యత మెరుగుఎ డిందని 'మెర్సర్స్ క్వాలిటీ ఆఫ్ ఇండెక్స్' తాజా నివేదిక (2023) కుండబద్దలు కొట్టింది. మెర్సర్స్ వరల్డ్‌వైడ్ క్వాలిటీ ఆఫ్ లివింగ్ (జీవన నాణ్యత) తాజా ర్యాంకింగ్స్‌లో భారత్ నుంచి హైదరాబాద్‌కు అత్యుత్తమ ర్యాంక్ దక్కింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ట్విట్టర్ (ఎక్స్) ద్వారా స్పందించారు. అంతర్జాతీయ సూచీలో హైదరాబాద్ ఘనత సాధించడం గర్వంగా ఉందని పేర్కొన్నారు.

గడిచిన తొమ్మిదేండ్లకాలంలో హైదరాబాద్ నగరం ఆరుసార్లు మెర్సర్ జాబితాలో టాప్‌లోనే నిలిచిందని కేటీఆర్ గుర్తు చేశారు. హైదరాబాద్ అభివృద్ధి కోసం కృషి చేశామని తెలిపారు. ఇప్పుడు దాన్ని మరో మెట్టు ఎక్కించాల్సిన బాధ్యత కొత్త ప్రభుత్వంపైనే ఉందని పేర్కొన్నారు.

మెర్సర్స్ జీవన నాణ్యత ర్యాంకింగ్స్‌లో బెంగళూరు, పుణే వంటి నగరాలను భాగ్యనగరం వెనక్కి నెట్టింది. ప్రపంచవ్యాప్తంగా హైదరాబాద్ 153వ స్థానంలో నిలువగా, పుణెకు 154, బెంగళూరుకు 156 ర్యాంకులు దక్కాయి. చెన్నై(161), ముంబై (164), కోల్‌కతా (170), న్యూఢిల్లీ (172) నగరాలు ఆ తర్వాత స్థానాల్లో నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ నగరాల్లో విదేశీ ఉద్యోగులు, ప్రవాసులు, వారి కుటుంబాల రోజువారీ జీవనం.. వాస్తవ పరిస్థితుల ఆధారంగా 'మెర్సర్స్' ఈ ర్యాంకుల్ని విడుదల చేసింది.

ఈ ర్యాంకింగ్స్‌లో భారత దేశానికి చెందిన 7 నగరాలు మాత్రమే చోటు దక్కించుకోగా, అందులో హైదరాబాద్ అగ్రస్థానంలో నిలవటం విశేషం. వివిధ దేశాలకు చెందిన ఉద్యోగులు, వారి కుటుంబాలకు అత్యంత నాణ్యతతో కూడిన జీవన పరిస్థితులు హైదరాబాద్ నగరంలో ఉన్నాయన్న నంగతి 'మెర్సర్స్ ఇండెక్స్' గణాంకాలతో సహా చూపుతున్నది. ఆర్థిక పరిస్థితులు, రాజకీయ హింస లేకపోవటం, సామాజిక సమానత్వం.. వంటివి ర్యాంకింగ్స్‌లో పరిగణనలోకి తీసుకోగా, భారత్‌లో మిగతా అన్ని నగరాలకన్నా హైదరాబాద్ మెరుగైన స్థానంలో నిలిచింది.

ప్రభుత్వాలు - ప్రజా సంక్షేమం

కేంద్రంలోనైన రాష్ట్రంలోనైన రాజ్యాంగం ప్రకారం ఎన్నికలకమిషన్ ద్వారా ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికలుజరిగి ప్రజా ప్రభుత్వాలు ఏర్పడి సంక్షేమం, అభివృద్ధి, రాజ్యాంగపాలన జరుగుతుంది.

దేశంలో రాజకీయ పార్టీలు ఏ పార్టీ వారైనా ఎవరి సిద్ధంతాలు వారికున్నా ప్రజా సంక్షేమమే ముఖ్యం. ప్రజల ఓట్లతోనేవారి మనుగడ జరుగుతోందని గ్రహించాలి. ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పడినా ప్రజా శ్రేయస్సే ముఖ్య ఉద్దేశ్యం. రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలో, కేంద్ర ప్రభుత్వం తన పరిధిలోపరిపాలన సాగించినా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్యసుహృద్భావం, సమైక్యత ఇచ్చి పుచ్చుకోవడం అవసరం.

ప్రకృతి విపత్తులు, ఆర్థికాంశాల విషయంలో సమన్వయంతో వ్యవహరించాలి. ఏ పార్టీ ప్రభుత్వమైనా ప్రజా సంక్షేమం,అభివృద్ధి, విద్య వైద్యం ఉద్యోగ పారిశ్రామిక ఉత్పత్తితోపాటు ప్రజల దైనందిన మౌలిక వసతులు సమకూర్చాలి.ఓట్ల కోసం వార్షిక ఆర్థిక బడ్జెట్ కు మించి సంక్షేమ పథకాలు, హామీలు ప్రకటించి తర్వాత అప్పుల వ్యయంతో పాలన సాగించడం భావ్యం కాదు. వికలాంగులు, ఏ పనీ చేయలేని ఆర్థికంగా వెనుకబడిన వయోవృద్ధులకు, ఏ ఆసరా లేని వంటరి మహిళలు, విధవలువంటి వారికి నెలవారీ పెన్షన్ల రూపంలో ఆర్థిక సహాయం చెయ్యాలి.చదువుకున్న యువతకు గవర్నమెంట్, ప్రైవేట్, పబ్లిక్‌సెక్టర్లలో, స్వయం ఉపాధి పథకాలతో ఉపాధి కల్పించాలి.యువకులే దేశానికి వెన్నెముక. వారు ఆరోగ్యంగా ఉత్సాహంగాఉంటే దేశ రక్షణ, ఉత్పాదక, పారిశ్రామిక రంగాల్లో ప్రగతిఉంటుంది. అన్ని రంగాల్లో దేశం అభివృద్ధి చెందుతుంది.ఉచితాలంటు ఓట్ల కోసం సంక్షేమ కార్యక్రమాలతో కష్టపడేవారిని కూడా సోమరిపోతుల్ని చెయ్యడం ఆర్థికంగా, ఉత్పత్తిపరంగా మంచిది కాదు. యువతకు విద్యావకాశాల కోసంపాఠశాలలు, గ్రంథాలయాలు, స్టడీ సెంటర్లు, స్టడీ మెటీరియల్స్ సమ కూర్చాలి. స్కిల్ డెవలప్మెంట్ సెంట ర్లలో వారి విద్యార్హతల అనుసరించి ట్రైనింగ్ ఇవ్వాలి. చదువుకున్న యువతఉద్యోగాల మీాదనే ఆధార పడకుండా వ్యవసాయ రంగం, పాల ఉత్పత్తి డైరీలు, కోళ్ల ఫారాలు, కూరగాయలు, చేపలపెంపకం, నర్సరీలు, పూల ఉత్పత్తులు ఇలా మార్కెట్లోస్వయం ఉపాధి దొరికేలా ఆర్థిక వనరులు సమకూర్చాలి.

వ్యవసాయదారులకు వరదలు, తుఫాన్, వర్షాభావపరిస్థితుల్లో పంట దెబ్బతిన్న సమయాలలో ఆర్థిక సాయంఅవసరం. వారికి పంట ఋణాలు, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు ,పండిన పంటకు గిట్టుబాటు ధర, పంట నిల్వలకు గిడ్డంగులు, రవాణా, మార్కెట్ సదుపాయాలు సమకూర్చాలి.

వర్షాకాలంలో కొండలపై నుంచి పారే నీటి కాలువలకుచెక్ డ్యామ్ లు నిర్మించడం, చెరువుల పూడిక తీసి పటిష్టమైన గట్లతో లోతు చేయించి వ్యవసాయానికి సాగు నీరు ఏర్పాటు చెయ్యాలి. గృహావసరాలకు, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకం మంచిది కాదు. కొంత పరిమితి పెట్టి ఉచిత విద్యుత్‌ఇవ్వాలి. లేకపోతే అవసరాన్ని మించి విద్యుత్ వాడకంఅధికం కావచ్చు. ఏ రంగంలోనైన వాడుతున్న విద్యుత్ కుప్రమాణంగా మీటర్లు ఉంటే ఉత్పత్తి వ్యయం తెలుస్తుంది.

రైతు కూలీలు, శ్రామికులకు పనికి ఆహార పథకం వంటివిఏర్పాటు చెయ్యాలి. వృత్తి పనివార్లకు వారు తయారు చేసినవస్తువులకు మార్కెట్లో ప్రచారంతో పాటు అమ్ముకునే పరిస్థితి కల్పించాలి. దేశీయ ప్రాంతీయ ఉత్పత్తులనుప్రోత్సహించాలి. ఆర్థికంగా వారు బలపడితే ఉత్పత్తిప్రోత్సాహం ఉంటుంది.పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులు అన్ని సంక్షేమ, అభివృద్ధి పనులు అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులోఉండే విధంగా కృషి చెయ్యాలి.కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను రద్దు చెయ్యకుండా మార్పులు చేర్పులు చేసి ప్రజాధనం వృధా కాకుండా చూడాలి. ఏ ప్రభుత్వం పాలనలోకి వచ్చినా ప్రజల శ్రేయస్సే ముఖ్యంగాభావించాలి.ప్రభుత్వ ఉద్యోగులకు సమకూర్చే సౌకర్యాలు ప్రైవేటు,పబ్లిక్ సెక్టార్ ఉద్యోగులకు సమకూరేలా ప్రయత్నించాలి. వారి భవిష్యత్తుకు నమ్మకం ఏర్పర్చాలి. యువతకు విద్యావకాశలతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలి.వారిలో శ్రామిక శక్తి, ఉత్సాహం పెంపొందించాలి. మద్య దిగువ తరగతి అన్ని వర్గాల వారికి విద్యతో పాటు ఆర్థిక అవసరాలు సమకూర్చి శ్రామికులిగా మార్చాలి.ముఖ్యంగా గ్రామీణ ప్రాంత యువతకు విద్యావకాశలు వృత్తి నైపుణ్యం కలిగించి వారి కాళ్ల మీద వారు నిలబడేలాఉపాధి కల్పించాలి.

ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు నిజాయితీగా నిష్పక్షపాతంగా పాలన సాగించిన నాడే దేశం పురోభివృద్ధిచెందుతుంది.



– కందర్ప మూర్తి
8374540331

తెలంగాణ కవుల సంఘం మరియు
తెలంగాణ భాషా సాంస్కృతిక సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో
సుతారపు వెంకట నారాయణ గారి
'అక్షర లహరి'
కవితా సంపుటి ఆవిష్కరణ

సభాధ్యక్షులు : బైస దేవదాసు, నేటినిజం దినపత్రిక సంపాదకులు
ముఖ్య అతిథి : ఆచార్య కొలకలూరి ఇనాక్,
పుస్తక ఆవిష్కర్త సాహితీ శిఖరం
గౌరవ అతిథి : డా॥అమ్మంగి వేణుగోపాల్
విశిష్ట అతిథి : డా॥ నాళేశ్వరం శంకరం
ఆత్మీయ అతిథి : అచార్య గోనా నాయక్
ప్రత్యేక అతిథి : బిక్కి కృష్ణ, ప్రముఖ కవి
పుస్తకసమీక్షకులు :డా॥ ఛందోజీ రావు
దొంతర బోయిన దైవాదీనం
ఆహ్వానం : అనుముల ప్రభాకరా చారి
సాహిత్య కార్యదర్శి
కవిసమ్మేళన నిర్వాహకులు .
అధ్యక్ష, కార్యదర్శులు.
తెలంగాణ కవుల సంఘం.

సభా వేదిక: రవీంద్ర భారతి మొదటి అంతస్తు
సమయం: 17 డిసెంబరు 2023 అదివారం
సాయంకాలం 6 నుండి 8 గంటల వరకు

నేటి కందం– నేటికి అందం

రంధులతో కొందరు–పరి
పంధులు మన ఇంధనమును భంగ పరుపగన్
సంధించి జ్ఞానసాయక
మింధనమును పొదుపుచేయనెంచగ వలయున్ ?

(డిసెంబరు 14 అంతర్జాతీయ ఇంధన పొదుపు దినం)

–రాధశ్రీ
సెల్:9494481210

నేటినిజం
సాహితీ కిరణాలు
website:www.netinijam.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 14-12-2023

చురక

ప్రజా దర్బార్ కు
పోటెత్తిన జనం
ఎన్నెన్నో సమస్యలు
ఎలుగెత్తిరి ఘనం.

కడగండ్లు కన్నీళ్ల
కారణాలపైన దృష్టి
పెట్టితేనే ప్రభుత్వం
పరిష్కార పరిపుష్టి.

-వేల్పుల నారాయణ
9440433475

సుంకోరవం

ఎవరికోసమో
ఎదురు
నిన్ను నీవు
నిర్మించుకోవాలి కదా.

పెద్దలు
నేటి ప్రేరణలు
పిల్లలు
రేపటి కిరణాలు.

ఓపిక లేకపోతే
ఎలా?
వసంతం
వస్తుంది గంటా

నాలుకకైన గాయం
సత్వరం మానుతుంది
నాలుక చేసిన గాయం
సతతం ఉంటుంది.

సర్వం సజావుగా
సాగాలనుకోకు
మజా ఉండదని
మరువకు

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

పుస్తక సమీక్ష

కొనుక్కోదగ్గ, కొనిపించదగ్గ పుస్తకం



ప్రతులకు: అక్షజ్ఞ పబ్లికేషన్స్ సికింద్రాబాద్. సెల్: 83414 50673

జగమెరిగిన బ్రాహ్మడికి జంధ్యపు పరిచయం అక్కరలేదు. సూర్యుడిని క్రొవ్వత్తితోనో, టార్చిలైటు తోనో చూపాల్సిన అవసరం లేదు. నూజివీడు రసాలకు బావున్నాయంటు ప్రత్యేకమైన 'కితాబు' ఇవ్వాల్సిన అగత్యం లేదు. తెలుగు జాతికి లభించిన అపురూప మాణిక్యాలు బాపూ రమణలను ప్రత్యేకించి పరిచయం చేయనక్కరలేదు.

కథ, నవల, వ్యాసం పద్యం, పాట చలన చిత్ర సంభాషణలు అనువాద రచనలు, జీవిత చరిత్ర ఆత్మకథ లాంటి సాహిత్య ప్రక్రియ లన్నింటా 'ముళ్ళపూడి' మార్కువేసిన ముళ్ళపూడి వెంకట రమణ రాసిన కథల సంకలనం ఇది. ఇందులో 1953 నుంచి 1961 వరకు ప్రచురించిన పది కథలున్నాయి. హాస్యం, వ్యంగ్యం, చెణుకులు, పదాల విరుపులు, కొత్త పదాల సృష్టి, ముళ్ళపూడి వారి కథల్ని మిగతా రచయితల్నుంచి వేరు పరిచి ఆమద దూరంలో నిలబెడతాయి. కథ ల్లోని ఒకటి రెండి వ్యాక్యాలు చదివితే చాలు, **'ఇది ముళ్ళపూడి మార్కు'** అని ధంకా బజాయించి శంక ఏ మాత్ర మూ లేకుండా చెప్పవచ్చును.

మొదటి కథ **'సీతా కళ్యాణం'** పౌరాణికం. జల ప్రళయం చీమలు, వాటి పుట్టలు, వాటి స్వగతాలు, మనిషి ఆగడాలు చెబితే, మిగతా కథలన్నీ మధ్యతరగతి మనుషులు, అందునా, యువ హృదయాల ప్రేమ గిలిగింతలు, చదువరికి పులకింతలు కలుగచేస్తాయి. నాటి కాలేజీ కుర్రాళ్ళ చదువులు, వరలక్ష్మీ వ్రతాలు, గంటలు కొట్టే గడియారాలు, ప్రయాణాల్లో పడుచు ఆడపిల్లల తండ్రులు, మరో మగపురుక్కుంట పడకూడదని తీసుకునే చర్యలు, హాస్యాలు, అపహాస్యాలు, గోదావరి తీరాలు విరహ గీతాలా పనలు, అయస్కాంతలా అతుక్కుపోయే వయస్కాంతాలు అన్నింటి సమహారమే ఈ కథా సంకలనం. బాపూ రమణల మొదటి సినిమా 'సాక్షి'కి మూలకథ ఉందిందులో.

ఇవన్నీ కలగలిపి, వాడని, వీడని పరిమళాల కదంబమాల ఇది. 70 ఏళ్ళనాడు ప్రచురించిన కథ **'ఛాయలు'** మొదలుకుని 60 ఏళ్ళనాటి **'సాక్షి'** సినిమా మూల కథతో సాగి పాఠకుల మనసుల్లో మొలక నవ్వులు, ఒక్కోచోట, చిరునవ్వులు పూయింప కథలివి.

పాయసంలో జీడిపప్పు పలుకుల్లా, చాకొలెట్ టాప్‌గా అలంకరించిన అయిసుక్రిములా పరువపు పడుచు పిల్ల ముఖ వర్చస్సులా బాపూ బొమ్మలు కథలకు అదనపు ఆకర్షణ.

అంత్యప్రాసతో మొదలయ్యే **'సీతా కళ్యాణం'** కథలో రమణగారు వెల యించిన శబ్ద విన్యాసం అక్షరాల అం దం, పొందిక అనన్య సాధ్యం అనిపి స్తుంది. శివ ధనుర్భాంగం 'ధర్ములకు అభయదమై, అధర్ములకు భయదమై మనోహరంగా వినిపించి దశదిశాంతా లు ప్రతి ధ్వనించాయట. రాముడు అవలీలామానుషుడుగా గోచరించాడ ట! నాటి సీతారాముల కళ్యాణ మధుర సంఘటనలని, నేటికీ వధూవర కరకమలాలలో పునరావృ తం అవుతూనే ఉందట! ఇప్పటికీ తెలు గు వారి శుభ లేఖల్లో చదువుతూనే ఉ ంటాము సీతాముల కళ్యాణ ఘట్టాన్ని. అప్పుడప్పుడే తెలుగు సినిమా రంగాన్ని తన సమీక్షలతో పరిచయం చేస్తున్న రమణగారి, రెండవ కథ **'సెరిబ్రల్ సినేమియా'** సినిమా స్క్రిప్టును సినీ రంగానికి అమ్ముకోజూసే ఆనంద రావు, మంచి విలన్ వేశం వెయ్యాలని ఆతృత పడే వరహాలు, ఇంటాయన విశ్వనాథం గారు బోలెడంగ హాస్యం పండిస్తారు. ఎదిగిన కూతురు సీత. అనుమా నపు తండ్రి భీమశంకరం గారు, భార్య కాంతమ్మ సీతతమ్ముడు రాధాయిల రైలు ప్రయాణం మనకు చక్కిలిగింతలు పెడుతుంది. వెధవ డబ్బు పోతే పోయింది నీ తను మరెవరూ చూడ కూడదని సీత మరే మగ పురుగును చూడకూడదను ఇంటర్ క్లాసు రైలు టిక్కట్టు కొంటాడు భీమ శంకరం. తీరా పెట్టెలో ఎక్కబో తూ నలుగురు అందమైన ఇరవయ్యేళ్ళ కుర్రాళ్ళు కనిపిస్తారు పెట్టెలో. టిక్కెట్టు సెకండ్ క్లాసుకు మార్చుకుని ఎక్కితే తర్వాతి స్టేషన్‌లో ఇరవయ్యేళ్ళ మన్మదుడు పరుగున వచ్చి ఎక్కుతాడు. దేవుడెప్పు డూ ఇంతే అనుకోక తప్పదు భీమ శంకరం గారికి **'లోక యాత్ర'** కథలో.

కాలేజీ కుర్రాళ్ళు తోటి విద్యార్థిపి విద్యార్థులకు **"నిక్‌నేం"**లు పెట్టకోవటం సహజం. ట్రయిన్ నెంబర్‌లు నైన్ డౌన్ అంటే ఆ ట్రయిన్‌లో వచ్చే సరోజ, టెనప్ అంటే సీతా లక్ష్మి. ధర్టీటూ అంటే ప్రొఫెసర్‌గారి అమ్మాయి సుందరిలు.

పదహారు పేజీల 'సాక్షి' కథలోంచి పదారువేల అడుగుల 'సాక్షి' సినిమా తీయటం, బాపు రమణల ప్రజ్ఞకు తార్కాణం. కథలన్నింటా మనోహరం గా, మనోజ్ఞంగా అనుభూతించేది పదాల పొందిక. మనోహర హర దనుర్భంగం అవలీలా మానుషుడు, అతిశయోక్తు లను అతి సామాన్య పదాల స్థాయికి దించే స్థాయి చూసే పెద్దలు చూడని పెద్దలు చూడలేని పెద్దలూను. దుర్విధీగతీ, దుర్గతీగిణం తడిగిణం, ఆనందరావు పరమానంద రావు అవటం, వాహనాలు రోడ్లని అరగదీ యటం, కష్టసాధ్యమైన పనులను కష్టపడి సాధించటానికి ఇష్టపడటం, సుపుత్రి గాయత్రి సావిత్రి రచయిత్రి, కవయిత్రి, తొలి కోడితో మేలుకుని కాకితో పడుకోవటం, అంపకంపాలు, ఏకలవ్యుడికి అర్థం. ఒక ప్రేయసిగల వాడు, మెడమీద పడ్డ ట్టు చూడటం, అశక్తుడి క్రోధం, దాని తరువాయి వాయ అయిన దుఃఖం, తేట మనసులో మొండి తిక్క, మొఖం మిరపకాయ తొక్కు చేసుకోవ టం, మధ్యాహ్నం నిశ్శబ్దపు మీది నిశ్శబ్దపు మధ్యాహ్నం ఏక్ టాకీస (ఒకే బిగిన), నిద్రకు నీళ్ళు ధారపొయ్య టం వంటి పదాల వాడుక, శబ్ద సౌందర్యం, నిరుపమానం. అందుకే ఇన్నేళ్ళయినా ఇన్ని ప్రచురణలకు నోచుకున్నా. పాతబడని పాళా బంగారం. ప్రచురణకర్తలు చెప్పినట్లు కొనుక్కోదగ్గ కొనిపించ దగ్గ, లేక మనమేకొని కానుకగా ఇవ్వదగ్గ పుస్తకం.

- కూర చిదంబరం
సెల్: 8639338675

ఆకాశానికి చిల్లులు పడ్డట్టుగా
అంతులేని ఎడతెరుపు లేని వర్షం
ఆరుకాల కష్ట పడ్డ
రైతు శ్రమనిటి పాలైంది
చేతికొచ్చిన పంటంత
నోటికందిన పంటంత
కండ్ల ముందే
కుళ్ళిపోయిన పంటలను చూసి
రైతు గుండె చెరువు అవుతుంది
మడుగులుగా మారిన
పంట చేండ్లల్లో
నాని మెలకెత్తుతున్న గింజల చూసి
రైతు గుండెలాగుతున్నాయి
ప్రకృతి పగపట్టినట్టు
రైతుపైన పడగ విప్పుతుంది
రమ్మన్నప్పుడు రాదు వర్షం
వద్దన్న వస్తుంటుంది వర్షం
వర్షం రైతుకు
మేలు చేయాలి కీడు కాదు
వర్షం
మిచౌంగ్ తుఫాన్ పేరుతో
రైతును నాశనం చేసి
పంటలను ధ్వంసం చేసి
తన తాపం తీర్చుకుంటుంది
ప్రకృతి తాపానికి కోపానికి
రైతు బలి అవుతున్నాడు
కష్టం పోయి కంట నీరు మిగులుతున్నాయి
అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టి
పెంచిన పైరును తుఫాను తన్నుక పోతే
రైతు బ్రతికేదెట్ల!దేశానికి తిండి దొరికెదెట్ల!!
ఓ ప్రకృతి నీకు రైతుపై కోపమెందుకే
ఓ ప్రకృతి నీకు రైతుపై కక్షెందుకే
ఓ ప్రకృతి నీ ప్రాణ పదమైన స్నేహితుడు
రైతన్నకు ఈ శిక్షెందుకు
నీ మేలుకోరే మిత్రుడు రైతన్నకు!
మరణ శాసనం రాస్తున్నవెందుకు?
కనికరం లేని కటినదానివని
ముద్ర వేసుకుంటున్నావెందుకు?

-ఉప్పెన
8106073661

సముద్ర రాక్షసి

ఆకాశం ఎందుకో చీకటిగా
సూర్యుడు దాగుడు మూతలతో
తారచుక్కల వెలుగు కనబడక
కారుమబ్బులు మెరుపుల గోల
సముద్రంలో సుడి పుట్టి
మిచాంగ్ పేరుగా మారి
తీరం నిండా కెరటాలు ఎగిసిపడుతూ
అల్పపీడనం ఉద్రేకంగా
నేలకు చేరిన తుఫాన్ .
గుండె గుడిసెలను కుదుపుతూ..
తీరవాసులను పరుగులు పెట్టిస్తూ..
అన్నదాతల ఆశలను నిర్వీర్యం చేస్తూ...
ఖాళీగా మిగిలిన బాటలను
కూలీల చెమట చుక్కలను
కార్మిక కష్టాల ఆనందాలను
వాయుగుండ తుఫానులతో బారీవర్షాలు
బతుకులను
ఆగమాగం చేస్తున్నాయి

-డా॥పగిడిపల్లి సురేందరు
8074856063

జనం కన్నీళ్ల లెక్క తేలడం లేదు

లెక్క తెగడం లేదు
లెక్క తేలడం లేదు
కూడికలు తీసివేతలు
గుణకారం భాగ హారం
ఎన్ని చేసినా....
లెక్క తేలడం లేదు.

అప్పు పెరుగుతూనే ఉంది తప్ప.
తగ్గడం లేదు.
పన్నులు పెరిగాయి
సర్కారు రాబడి వరదయ్యింది.

ధరలు పెరిగాయి
ధనికుల సంపద పెరిగింది
సామాన్యుని అప్పు పెరిగింది.

సర్కారు అప్పు పెరిగింది
లెక్క చిక్కడం లేదు
ఎక్కడి చీకటి అక్కడే ఉంది
ఏ వెలుగు బతుకులో లేదు.

మాటల యుద్ధాలు హామీల వరదలు
కాయ కష్టం ఉంది
బతుకు లేదు బతుకు గడవదు.

నీతి మాటే లేదు అంతా మత్తు
మాయమాటల మత్తు.

వనరుల విధ్వంసం
గాలి మాటల మతలబులు
మనసులపై మాటల గాయం
మనుషులపై ఉద్రేకాల గాయం.

మత్తులను దాటుకుంటూ ...
సామాన్యుని బతుకు పోరు
ఆశల పూదోటలో మొక్కకు నీళ్లందవు
వాడుతున్న పూలు.

విలువల చట్టాల పతనం
రాజ్యాంగ విలువల పతనం
మారుతున్న రంగులు.

బజారులో సిద్ధాంతాల రాగాలు
ఎగిరే జెండాల
రంగులు మారుతూ...

వ్యూహాలన్నీ డబ్బు సుట్టే
దిగజారిన రాజకీయాలకు
జనాలే ప్రయోగశాలలు

జన ఎజెండాలు పాతాళంలోకి
ఉచితాల భారతం
ఉద్వేగాల భారతం
రక్తాన్ని సలసలా
మండించే భారతం.

అల్లకల్లోల సమాజం
అస్తిత్వం పై దాడుల భారతం
శాంతి లేదు.

కట్టీల భారతం
కబ్జాల భారతం
ఆలోచనలపై దాడి
ప్రశ్నగా మారిన మనుగడ
విలువల పతనం
మత్తుల విలయతాండవం.
సమాజపయనంలో
సామాన్యుడి విలవిల.

ఆర్థిక అంతరం
ఆకాశం ...భూమిలా...

లక్షల కోట్ల మొండి బకాయిలు
లక్షల సంఖ్యలో నిరుద్యోగులు

అడుగడుగు లైంగిక హింస
అడుగడుగు మతాల హింస
సగటు మనిషి ఆరోగ్యం దోపిడీ
ఆరోగ్య వ్యాపారం
శ్రమజీవి అప్పుల్లో లెక్క తేలదు.

లాభాల భారతన
అన్ని అమ్మకం
సగటు జీవికి బతుకు ఉండదు
శ్రమజీవికి మెతుకు ఉండదు
లెక్క తేలడం లేదు.
జనం కార్చిన, శ్రమజీవి
కారుస్తున్న బాధల
కన్నీళ్ళ లెక్క
జనం చెమటల
లెక్క తేలడం లేదు.

-సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

ఉచిత బస్సు

ఉల్లాసమే ఉచిత బస్సు
మహిళా లోకానికి అభయమస్తు!
అయినదానికి కాని దానికి బస్సు
ఇక ఎక్కి తిరుగవచ్చు మస్తు!
ప్రజా సేవయే మా కర్తవ్యం
ఈ నాడు నిజం అవుతున్న నినాదం !
దూర భారం కొంత తొలగింది
ఉచిత బస్సు కొంతంత వెలిగింది !
కోపం వస్తే వెళ్లవచ్చు పెనిమిటి కి
చెప్పక నే పుట్టింటికి!
సంతకు, పని చెంతకు
మహిళలలు ఉచితంగా వెళ్ళి రావచ్చు!
సుట్టపక్కాల చేరి సంతోషంగా
బలగం బంధాలు పెంచుకోవచ్చు!
చదువులు చదివే పిల్లలకు తీరు
క్యూ లైన్ల బస్సు పాసుల కష్టాలు!
సినిమా షికారులకు
ఉచిత బస్సు శ్రీరామరక్ష!
తొక్కిసలు క్రిక్కిరిసిపోకుండ
మరో బస్సెక్కితే అదే మనకు రక్ష
నట్టింట్లో
టి.వి.సీరియల్లు చిన్న బోవు!
వంటింట్లో
గాజులు లేని చేతుల గలగలలు!
నా ఇంటికి నేనే యజమానురాలిని
మహిళా సాధికారత కు ధన్యురాలిని!
బస్సు చక్రం తిరుగుడు ఆగిపోవద్దు
యిక మనం ఆగమాగం కావద్దు!
ప్రగతి రథం పడకేయవద్దు!
పక్కా పథకంతో జగతిలో
వన్నెకెక్కాలి ఉచిత బస్సు!

-పి.బక్కారెడ్డి
9705315250

చెడు ఆలోచనలు తొలగిననాడే మనిషికి విలువ

'కణిక' ఆత్మీయ సమ్మేళనంలో శ్రీమతి అయినంపూడి శ్రీలక్ష్మి

"చెత్తబండి" దీర్ఘ కవిత ఆవిష్కరణలో కొలచన శ్రీసుధ, సత్యనీలిమ, యస్. ప్రవీణ్‌కుమార్, డా॥ నాళేశ్వరం శంకరం, బైస దేవదాసు, రమాదేవి కులకర్ణి, ఆవిష్కర్త అయినంపూడి శ్రీలక్ష్మి, కుమారి జయలక్ష్మి, డా॥ ఏనుగు నరసింహారెడ్డి, రమాదేవి కులకర్ణి కుటుంబ సభ్యులు.

మనిషి మనసులో పేరుకు పోతున్న 'చెత్త' తొలగిననాడే మనిషి విలువ పెరుగుతుందని అక్షరయాన్ వ్యవస్థాపక అధ్యక్షులు, 'చిత్రవాణి' డైరెక్టర్ అయినంపూడి శ్రీలక్ష్మి అన్నారు. ఆదివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో జరిగిన సాహిత్య, సామాజిక సేవ, విద్యారంగ వేదిక 'కణిక' ఆత్మీయ సమ్మేళనంలో శ్రీలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'కణిక' వ్యవస్థాపకురాలు రమాదేవి కులకర్ణి రచించిన దీర్ఘ కవిత 'చెత్తకుండీ' పుస్తకాన్ని ఆవిష్కరించారు. మనిషి జీవిస్తున్నాడు కాని తనలోని చెత్త ఆలోచనలను గమనించడం లేదని దానివల్ల తనకు సమాజానికి ఎంతో నష్టం కలుగుతోందని అన్నారు. ఈ చెత్తబండి పుస్తకంలో సమాజ స్థితిగతులు కళ్ళకు కట్టినట్టు ఆవిష్కరించారని రమాదేవి కులకర్ణిని అభినందించారు. 250 మంది సభ్యులు గల 'కణిక'లోని కవులతో రచనలు చేయిస్తూ ఆత్మీయ సమ్మేళనం పేరుతో వారందరినీ సత్కరించడం పట్ల రమాదేవి కృషిని కొనియాడారు.

సభాధ్యక్షులు తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు డా॥ నాళేశ్వరం శంకరం మాట్లాడుతు డబ్బున్న వారిలో, అహంకారం వున్న వారిలోనే ఈ 'చెత్తజబ్బు' వుందని వారి గురించే రమాదేవి దీర్ఘ కవిత రాశారని అన్నారు.

'కణిక' అంటే నిప్పు అని ఆ నిప్పుతో సమాజంలోని కుళ్ళును తొలగించడానికి ఒక సంస్థను ఏర్పాటు చేసి కవుల కలాలకు పదును పెట్టిస్తున్నారని అన్నారు.

విశిష్ట అతిథిగా పాల్గొన్న ప్రముఖ కవి, విమర్శకులు డా॥ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతు పద్యాలకు మకుటం వున్నట్టుగానే ఈ 'చెత్తబండి' పుస్తకంలోని దీర్ఘ కవితలో ఒక్కో అంశం తీసుకుని మకుటంతో రాశారని కొందరి మనసులోని పనికిమాలిన ఆలోచన లను చాలా బాగా వివరించా రని రమాదేవిని అభినందిం చారు. పట్టుదల వ్యక్తి కాబట్టే 'కణిక' సంస్థను విజయవంతంగా నిర్వహిస్తు న్నారని అన్నారు.

అక్షరయాన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు ఐనంపూడి శ్రీలక్ష్మిని సత్కరిస్తున్న అతిథులు

ప్రత్యేక అతిథి బైస దేవదాసు మాట్లాడుతు తనకు కవిత్వం గురించి ఏమీ తెలియదని అమాయకంగా మాట్లాడుతూనే సమాజంలోని కుళు క్కును ప్రశ్నిస్తు కలానికి పదును పెడుతున్న రమాదేవిని అభినందిం చారు. నిత్యం జరుగుతున్న సంఘ టనలు ఈ 'చెత్తబండి' పుస్తకంలో కన్పిస్తాయని మనిషి తన మనసులోని 'చెత్త'ను తొలగించుకుని బ్రతకాలన్న తపన పుస్తకం ఇందా కనిపిస్తోందని చివరి పేజీలో వున్న కవితను చదివి వినిపించారు. ఒక సంస్థను ఏర్పాటు చేయడం గొప్ప కంటే ఆ సంస్థను విజయవంతంగా కొనసాగించడం గొప్ప విషయమని రమాదేవిని అభినందించారు.

ప్రముఖ కవి, విమర్శకులు డా॥ ఏనుగు నరసింహారెడ్డిని సత్కరిస్తున్న అతిథులు

గాంధీకింగ్ స్కాలర్‌షిప్ గ్రహీత, చెత్త ఏరుకునే అమ్మాయి కుమారి జయలక్ష్మికి రమాదేవి కులకర్ణి 'చెత్తబండి' దీర్ఘ కవిత మొదటి పుస్తకాన్ని అందజేశారు. జయలక్ష్మి స్పందిస్తు.. నా తల్లిదండ్రులు ఇంటింటికి వెళ్ళి 'చెత్త'ను ఏరుకునే వృత్తిలో వున్నారని, వాళ్ళతోపాటు నేను కూడా రోజు చెత్త ఏరుతూ ఇంటర్మీ డియట్ చదువుకొనసాగి స్తున్నారని ఇంత పెద్ద సభలో నన్ను వేదికపై కూర్చోబెట్టి నాకు మొదటి పుస్తకాన్ని ఇచ్చిన రమక్కకు నేనెంతో ఋణపడ వున్నానని గద్గద కంఠంతో అన్నారు. మేము చెత్త ఏరుకునే వాళ్ళమే కాని మావి చెత్త మనసులు కావని, నాలాంటి వాళ్ళు ఎందరో వున్నారని మాకు కావల్సింది ఇంత ప్రేమ, గౌరవం చాలు, అది మాకు ఎంతో సంతృప్తినిస్తుందని వేడుకొ న్నారు.

'కణిక' వ్యవస్థాపకురాలు రమాదేవి కులకర్ణి స్పందిస్తు అక్షరయాన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఐనంపూడి శ్రీలక్ష్మిగారి ఆశీస్సులతో ఏర్పడిందే ఈ 'కణిక' వేదిక అని, అన్ని వేళలా సహకరిస్తున్న శ్రీలక్ష్మి, డా॥ ఏనుగు నరసింహారెడ్డి, బైస దేవదాసు, డా॥ నాళేశ్వరం శంక రంలకు ధన్యవాదాలు తెలిపారు. రెండు రాష్ట్రాల నుండి వచ్చిన కణిక కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

కొలచన శ్రీసుధ 'చెత్తబండి దీర్ఘ కవిత'పై పుస్తక సమీక్ష చేశారు.

యస్. ప్రవీణ్ కుమార్, వలిపె సత్యనీలిమల సభా నిర్వహణలో కవి సమ్మేళనం జరిగింది.

చిన్నారుల నృత్య కార్యక్రమం అందరిని అలరించింది. చివర 'కణిక' సభ్యులందరికీ అతిథులు మెమెంటో శాలువాతో సత్కరించారు.

ప్రముఖ విమర్శకులు డా॥. నాళేశ్వరం శంకరంను సత్కరిస్తున్న అతిథులు

'కణిక' అధ్యక్షులు రమాదేవి కులకర్ణిని సత్కరిస్తున్న అతిథులు

కుమారి జయలక్ష్మికి మొదటి ప్రతిని అందజేసి సత్కరిస్తున్న అతిథులు

బుద్ధ పర్కలు

యాసను భాష
ఎక్కిరిచ్చింది
తెలుగును చూసి
ఇంగ్లీష్ ఇకిలిచ్చింది

చెరువునిండి
మత్తడి దునికింది
పల్లె మల్ల
నీళ్ళాడింది.



-అన్నవరం దేవేందర్
9440763479

ఇమ్రాన్ మాస్టర్, మంజరి మాస్టర్ విజయ కులకర్ణి
నాట్య బృందం వారిచే చిన్నారుల గణేష్ వందన నృత్య ప్రదర్శన

గవ్వలు

స్త్రీ పురుషుడనే
తేడాలేదు..
క్రమశిక్షణ నేర్పుతుంది 'చలిపులి'

వడ్లగింజలు తెల్వదు
బియ్యం తప్ప!
చదివింది కారోరేటు' స్కూల్

-జిందం అశోక్
సెల్: 8978532225



నీ స్నేహం కథ

అనగనగా రాయగిరి అడవిలో జంతువులు నివసిస్తున్నాయి. ఒకరోజు అడవిలో చిరుత మరియు జింక తెలియకుండా ఎదురెదురయినాయి. చిరుతను చూసి జింక నన్ను చిరుత తినేస్తుందేమోనని భయపడింది. జింక భయాన్ని గమనించిన చిరుత మిత్రమా! నువ్వు భయపడకు నిన్ను నేను ఏమి చేయను అంది. జింక కొంత ధైర్యం తెచ్చుకుని, తెలియకుండానే పరిచయమైన జింక మరియు చిరుత ఇద్దరు కాసేపు ముచ్చట పెట్టుకుని తిరిగి ఎవరి దారిలో వాళ్లు వెళ్ళిపోయారు.

ఒకరోజు మళ్లీ అనుకోకుండా చిరుత, జింక ఎదురెదురు అవుతారు. అప్పుడు జింకతో మరో జింక ఉంటుంది. తనకు మిత్రుడే కదా చిరుత ఇక నన్నేం చేయదని జింక దగ్గరగా ఉండసాగింది. కానీ చిరుత ఆరోజు ఆకలితో ఉంది. ఇప్పుడు చిరుత దృష్టి మరోజింకపై పడింది. తనతో వచ్చిన జింక వైపు చూడడం మిత్రుడైన జింకకు అనుమానం కలిగింది.

అప్పుడు జింక ధైర్యం చేసి మిత్రమా! నీ చూపు నాకు అర్థమైంది. నీకు ఆకలిగా ఉంటే నన్ను చంపి ఆకలి తీర్చుకో! కానీ నా స్నేహితుడిని చంపకు అని చిరుతను ప్రాధేయపడింది. అప్పుడు చిరుత తన మనసు మార్చుకుని, జింకలిద్దరిని వదిలిపెట్టింది. జింకలు చిరుతకు నమస్కరించి, వెళ్లిపోయాయి. అప్పటినుంచి చిరుత అడవిలో ఉన్న జింకలను మిత్రులుగా భావించి తినడం మానేసింది.

నీతి: స్నేహం విలువ తెలిసిన వాళ్ళు మనసున మార్పు తెచ్చుకుంటారు.

-ముదావత్ శిరీష, తొమ్మిదవ తరగతి
జిఖఉూ హవేలీ ఘనపూర్ మెదక్ జిల్లా

కొత్త శీర్షిక ఈ వారం కొత్త కథ

త్వరలో నేటి నిజం దిన పత్రికలో **'ఈ వారం కొత్త కథ'** శీర్షిక ప్రారంభిస్తున్నాము.
మీ కథలు యూని కోడ్ ఫాంటులో గాని, డిటిపి చేసి ఒపెన్, ఫైలుతో పాటు పిడిఎఫ్ ఫైల్ గాని పంపండి.

ప్రచురించిన కథకు విశాల సాహితి **300 రూపాయలు** పారితోషికం. బహుమతిగా అందజేస్తుంది.

ఈ శీర్షిక నిర్వహించుటకు సుప్రసిద్ద సీనియర్ రచయిత **బి. ఎస్.రాములు**గారు అంగీకరించారు.

సంపాదకులు
'నేటినిజం' దినపత్రిక, మాతృశ్రీ నిలయం
ఎస్.ఆర్.టి. 169, జవహర్‌నగర్, హైదరాబాద్-500 020

మణిపూసలు

ఎదలో కొలువైనది
మమతల నెలవైనది
అమ్మప్రేమ ప్రపంచాన
అన్నిట అరుదైనది!

ఇల కాలుష్యాల చేర్పు
పర్యావరణములో మార్పు
తప్పిదాలకు మూల్యం
చెల్లించాలంటు తీర్పు!.

వనాలు లేవంటే కరువు
కష్టమౌను బ్రతుకు తెరువు
పర్యావరణం మరిస్తె
జీవితమవుతుంది బరువు!

ముట్టుకుంటే ముడుచుకొను
చెట్టు విలువ తెలుసుకొను
తరచిచూస్తే ప్రతితరువు
ఆరోగ్యాలకు నెలవును!

మనసుది చంచలత్వం
మనిషిది స్వార్థతత్వం
బుద్ధితోని యోచిస్తే
అనుగును బద్ధకత్వం!

కనువిందగు అందాలు
కట్టుంచెవి బంధాలు
కవుల స్పందనతోటి
వెలుగు కావ్య గ్రంథాలు!

-యన్.వి.రఘువీర్ ప్రతాప్
సెల్:9440551552.

జై జవాన్

కథ

నిద్రమత్తులో ఉన్న నాకు ఒకసారి పెద్దపెద్ద గొంతులు వినిపించినవి. కిటికీ తెరచి చూసిన.

మా ఇంటి దగ్గర చవరస్తా మీద కొంతమంది.

పొద్దున్నే అరుపులు, కొట్లాటలు.

ఒక్క చోట గుమికూడినరు. నేను అక్కడ గల్లీకి పోత అని ఒకరు. నేను ఇక్కడ గల్లీకి పోతానని ఇంకొకరు. వాళ్ళ హెడ్ ఎక్కడ చెపితే అక్కడ చేయాలి డ్యూటీ. అప్పుడు జవాన్ మా సాయిలు

ఎంత మంచోడు. నీతి నిజాయితీకి నిలువెత్తు నిదర్శనం

పొద్దుగాల తెల్లారగట్లనే వస్తడు కాలనీకి. పని చేసే సపాయోళ్ళు వస్తరు. ఆడోళ్లు రోడ్లు ఊడ్వనీకి. మగోళ్ళు చెత్తకుప్ప ఎత్తనీకి.

కాకి ప్యాంటు కాకి షర్ట్ వేసుకుని చేతిలో ఓ కట్టె పట్టుకుని వస్తడు. ఇంకో చేతిలో విజిల్ ఉంటది. అప్పుడప్పుడు పని వాళ్ళు చక్కగ చేయకుంటే సీటీ అంటే అదే విజిల్ ఏస్తడు. బక్కగా పొట్టిగా ఉంటడు కానీ అందరికి అతనంటే హడల్.

చాలా స్ట్రిక్ట్ మనిషి. పనిలో నిబద్ధత, నైపుణ్యం అతని సొత్తు. మంచిగా పని చేయిస్తడు తన కింది వారిచేత. వస్తేనే హాజరు. లేకుంటే గైరాజరు.

ఇప్పటోళ్ళ కొంతమందిని చూస్తున్న. వాళ్ళు రాకపోయినా హాజరేసి సగం జీతం పైసలు గుంజుతరు. వీళ్లకు రెస్ట్ ఇచ్చి ఇంట్లో పడుకోబెడతరు. సగం సగం జీతం. కానీ మా సాయిలు అట్ల కాదు. అందుకే రోడ్లు మిలమిల మెరిసేవి. అద్దంలో చూసుకుని మురిసేవి.

ఎవరికి కేటాయించిన వారు చేయాల్సిందే. దానిలో బేరం లేదు.

జవాన్ అంటే దేశాన్ని రక్షించే వాడని తెలుసు. రోడ్డును రక్షించే మున్సిపాలిటీ జవాన్ మా సాయిలు. పండుగలకు ఇచ్చే ఇనాంతో తృప్తి పడతడు. మంచిగ ప్రేమ గౌరవంతో మాట్లాడుతడు.

మున్సిపాలిటి అంటే చెత్త ఎత్తే చెత్త వాళ్లనుకుంటాం కానీ చెత్తను తీసేసే శ్రామికులు అని ఎవరనుకోరు. మనలో చెత్తబుద్ధిని తీసేస్తే లోకమంతా పచ్చగనే కనిపిస్తది. వీళ్ళలో కూడ పని చేయని వళ్ళు దాచుకుని ముచ్చట్లు చెప్పే చెత్త మనుష్యులు ఉన్నరు. కానీ ఎవరో ఒకరు మా సాయిలు లాగా చక్కగా పని చేయించే లాంటి వారు అరుదు.

ఒక కంప్లయింట్ వచ్చిందంటే డ్రైనేజీ పొంగిందనో, నిండిందనో వెంటనే ఊడిపడతడు, చెత్త పేరుకుపోయన దాఖలాలు లేవు. రోడ్లు ఎప్పుడు పరిశుభ్రంగా ఉండేవి. ఆకాలం వేరు. ఇప్పుడు పని దొంగలు, పైసలదుగుడు.

ఎప్పటికైనా మరవని మంచి మనిషి. పనియే దైవమని తలచే గొప్ప మనస్తత్వం. ఏ లోకంలో ఉన్నాడో ఇప్పుడు. ఈ కాలంలో అట్లాంటి వారు అరుదు. ఆనాడు సై సై అనే సాయిలు సో సో అనే నేటి జవాన్...

జై జవాన్

-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి
9490367383

సంతోషం

కథ

"ఏవండోయ్!"

ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు ముందుగదిలో దినపత్రిక చూస్తున్న మోహన్ భార్య సామ్రాజ్యం వంటింట్లోంచి వేసిన కేకలాంటి అరుపుకి అరుపులాంటి కేకకి.

"వచ్చేవారం మీ పిన్ని కొడుకు పెళ్ళికి వెళ్ళాలండోయ్ మనం."

పొలికేక తర్వాత భార్య నోటి నించి ఆ మాట రావడంతో ఏమైందో ఏమిటోనని కంగారుగా చేతిలో దినపత్రిక పడేసి లేచిన మోహన్ ఓయీ ఓసీ విభక్తులు చదువుకుంటూ టపక్కన మళ్ళీ కూర్చుండిపోయాడు.

ఇంకా పన్నెండు రోజులుంటే ఏదో ఇప్పుడే వెళ్ళిపోవాలి మర్చిపోయి కూర్చున్నామన్నట్లుగా ఆ అరుపేమిటి? ఆ కంగారేమిటి? గట్టిగా విసుక్కోడానికి భయం. కాస్త మెల్లిగానే చిరాకు చూపించాడు.

ఎందుకంటే తను కూడా అప్పుడప్పుడు అనవసరమైన వాటికి అలా అరిచే బాపతే కాబట్టి. అయినా ఉండబట్టలేక అన్నాడు "ఇంకా చాలా రోజులుంది కదా ఈ రోజే పెళ్ళి అన్నట్లుగా ఆ కంగారేమిటి సామూ!"

"మీ మగాళ్ళకి ఎన్నిసార్లు చెప్పినా కొన్ని విషయాలు అర్థం కావులెండి.॥

"ఔనౌను నీకన్ని విషయాలూ అర్థమవుతాయి కదా పాపం! చీరల సంగతులు తప్ప నీ బుర్రకేవన్నా ఎక్కుతాయా అసలు?"

"అలా రండి దారికి" అంటూ వంటింట్లోంచి బయటపడింది సామ్రాజ్యం.

"గోదార్లో దిగానా?" గుండెల్లో రాయి పడింది మోహన్‌కి.

"నేను కొత్త పట్టుచీర కొనుక్కోవాలి కదా! ఇప్పుడు బజారెళ్ళాలి మనం లేవండి ."

"ఇది చాలా అన్యాయం సామూ! ఊళ్ళో ఎవరింట్లో ఏ శుభకార్యం వచ్చినా నీకు కొత్త చీర కొనిపించుకుంటావు. నా జీతం అంతా నీ చీరలకే సరిపోతోంది."

వచ్చి భర్తకెదురుగా కుర్చీలో కూర్చుంది సామ్రాజ్యం.

"మన బంధువులూ, స్నేహితులూ అందరూ ఈ ఊళ్ళోనే ఉన్నారు కదండీ!"

ఇప్పుడేదో బోధించబోతోందని తెలిసిపోయింది మోహన్‌కి. తను బోధిచెట్టు కింద ఉన్నాడా? అనుకుంటూ పైకి చూశాడు తలెత్తి.

"ఏవిటండీ! నేను ఎదురుగా ఉంటే అలా పైకి చూస్తారేంటీ? ఏవుందక్కడా? ఓహో! అక్కడ బూజు వేలాడుతోందనా? నేను బూజులు సరిగ్గా దులపట్లేదని పరోక్షంగా చెప్పదమా ఇది!"

"పరోక్షంకాదు ప్రతిపక్షం కాదు. అసలు సంగతేవిటో చెప్పు".

> "ఊళ్ళో ఎవరింట్లో ఏ శుభకార్యం వచ్చినా నీకు కొత్త చీర కొనిపించుకుంటావు. నా జీతం అంతా నీ చీరలకే సరిపోతోంది".

"అదికాదండీ! మనవాళ్ళందరూ ఎవరిళ్ళల్లో ఏ కార్యక్రమం జరిగినా అందరినీ పిలుస్తారు. ఒక్కళ్ళం కూడా మానకుండా అందరం హాజరవుతాం కదా. ఆ కట్టు మనలో ఉంది. ఔనా కాదా! పైగా ప్రతినెలా ఎవరో ఒకరింట్లో ఆ విధంగా కలుస్తూనే ఉంటాం. మరి అలాంటప్పుడు సేమ్ చీరలు కట్టుకెళ్తే సేమ్ మనుషులు చీరలు గుర్తు పట్టేస్తారు కదండీ!"

వింతగా అనిపించింది మోహన్‌కి. ఏదో దొంగని గుర్తు పట్టేస్తారన్నట్టుగా అలా భయపడిపోతుందేవిటి? "గుర్తుపడితే ఏమైంది సామూ! నువ్వు కొనుక్కున్న చీరలే గానీ ఎక్కడో కొట్టుకొచ్చిన చీరలు కాదుగా!"

"ఛీ ఛీ! అవేం మాటలు. అస్తమానం కలుస్తూ ఉంటాం కాబట్టి ప్రతిసారీ కొత్త కొత్త చీరలు కొనుక్కోకపోతే ఈ సామ్రాజ్యానికి అట్టే చీరల్లేవు. ఎప్పుడూ కట్టినవే కడుతుంది కొత్తవి కొనుక్కోదు కాబోలు అనుకుంటారని అనుమానం. మీ మగాళ్ళు రోజూ ఒకే జత కట్టుకున్నా కూడా తేడా పడదు. పదండి పదండి వెళ్దాం."

చీర కొనగానే అయిపోదు దానికో తతంగం ఉంది కదా ఫాల్ కుట్టీం చాలి. మ్యాచింగ్ బ్లౌజ్ కుట్టించుకోవాలి.. మొత్తమ్మీద కొత్త పట్టుచీర కొనుక్కునే ప్రహసనం అయింది.

పెళ్ళికి హడావిడిగా ఇంటి తాళాలు అందుకుని బయల్దేరిన భార్య వెనక తనూ నడిచాడు మోహన్. బయట అడుగు వెయ్యబోతున్నదల్లా ఆగి వెనక్కి తిరిగింది సామ్రాజ్యం "మీ కెమేరా తీసుకురండి" అంటూ సొంత కెమేరాలో ఫొటో తీసుకోవాలన్న ఆశ కోరిక.

పకపకా నవ్వాడు మోహన్ "అది డబ్బా కెమేరా. అందుకే మూలపడేశాను సామూ!"

"మరి మంచి కెమేరా కొనకపోయారా?" అన్న ప్రశ్న గోడక్కొట్టిన బంతిలా వచ్చేసరికి గుండెల్లో రాయి పడింది. ఇంకో మాటకి అవకాశం ఇవ్వకుండా రివ్వున లోపలికి పరిగెత్తి అలమారలో ఎక్కడో మూలపడేసిన పాత డొక్కు కెమేరా తెచ్చి భార్య చేతిలో పెట్టాడు. నీ దగ్గిర ఉంచు. నేను ఆ పెళ్ళి హాల్లో ఎక్కడైనా పెట్టి మర్యిపోతానేమో నీకెప్పుడు కావాలో అప్పుడు ఎవరిచేతైనా తీయించుకో ఫొటో. నాకోసం చూడకు. నేను మా రమేష్‌గాడితో అటూ ఇటూ వెళుతూంటాను" అన్నాడు గబగబా.

ఓ పెద్ద బాధ్యత తనమీద నమ్మకంతో అప్పగించేశాడన్నట్టుగా సంతోషపడి పోయింది సామ్రాజ్యం. అంతేగానీ ఆ డొక్కు కెమేరా పట్టుకోడం ఇష్టంలేక ఇచ్చేశాడని తెలియదు పాపం.

ఆ రోజు మోహన్ ఆఫీసునించి ఇంటికి వచ్చేసరికి చేతిలో ఓ ఫోటో పట్టుకుని తెగ మురిసిపోతూ చూస్తోంది సామ్రాజ్యం. ఆ ఫోటోలోకి తొంగిచూసి నవ్వాపుకోలేకపోయాడు మోహన్.

ఒక పదిమంది దాకా వరసగా నిలబడి ఉన్నారు అందులో. ఎవరికీ తలలు లేవు. మెడ కింద భాగం నించే ఉన్నారందరూ. పొట్ట చెక్కలయ్యేలా నవ్వొస్తూనే ఉంది మోహన్‌కి.

ఎవరి ఎవరో తెలియని ఆ ఫోటో అంత మురిసిపోతూ అంతసేపు చూస్తున్నావేంటని అడగకుండా ఉండలేకపోయాడు.

"ఎవరు ఎవరో తెలియకపోడం ఏంటీ? ఇంత చక్కగా తెలుస్తుంటేనూ. ఇదుగో చూడండి ఈ మైసూర్ సిల్క్ చీర మా పిన్ని. ఈ ఎర్ర కంచిపట్టుచీర మీ మేనత్తగారు. ఈ ఉప్పాడ పట్టుచీర మీ పిన్ని. ఈ గద్వాల చీర మీ చిన్న అమ్మమ్మగారు. ఈ వర్క్‌శారీ ఆ తిప్పలాడి మీ మావకూతురు" ఆ పిల్ల మీదున్న అక్కసంతా ఆ ఒక్కమాటలో చూపించేసింది.

"అదేవిటి ఇంక చూడరా అలా వెళ్ళిపోతున్నారు ఇంకా అయిదుగురున్నారు. అయినా నన్ను చూడనేలేదు ఇంతకీ మీరు" కంగారు పడిపోయింది సామ్రాజ్యం.

"నువ్వెక్కడున్నావో నేనేం గుర్తు పడతాను మొహవే లేదుగా అందులో.."

"అందుకే మరి చీరలు గుర్తెట్టుకోవడం. చీరల అందాల ముందు మొహాలెలాగో వెలవెలబోతాయి. ఆ రోజు కొనేటప్పుడే షాపులో చెప్పాను కదా నేను నా చీర ఫోటోలో చాలా బాగా పడుతుందని, చూడండి ఎంత బాగా పడిందో ఈ రంగు.."

ఆ చీర సంగతేమో గానీ సంతోషంతో మురిసిపోతున్న భార్య మొహం చాలా అందంగా, ఇదివరకు కంటే ఎంతో అందంగా ముచ్చటగా కనపడింది మోహన్‌కి. ఆ చీర కొన్న రోజు అయ్యాబాబోయ్ ఇన్ని వేలే అని బాధపడ్డాడు కానీ ఇప్పుడు భార్య మొహంలోని మెరుపు ముందు ఆ డబ్బు చాలా తక్కువే అనిపించింది.

-తమిరిశ జానకి
9441187182

బంజారా నానీలు

తండా కూడా
కన్నీరు కారుస్తుంది
గోరటి ఎంకన్నా!
జర ఇటు చూడన్నా!!



నీ దయ వల్ల
ఎంత మారాను నేను
ఓ నా గ్రామమా
నువ్వలాగే ఉన్నావు.

-డా॥ సూర్యాధనంజయ్
సెల్:9849104187



మన్నించమ్మ

వేవేల అనుభూతులకు ఆదివి నీవు...
పుట్టుక నుండి మరణం వరకు అనుభవాల పరంపర ...
మకరందాలు నింపిన పుష్పాల చిరునవ్వుతో స్వాగతం పలికావు...

స్వచ్ఛమైన స్వేచ్ఛ ఊపిరులు మా కందించిన పెన్నిధి...
బాల్యం నుండి మరుబాల్యం వరకు చేదోడువై నిలిచావు ...
నిప్పులు కురిసే ఎండన సేద తీర్చిన అమ్మవూ.. ..

వానజల్లులకు గొడుగై నిలిచి ఒడిన పొదువు కున్నావు..
అనాలోచిత ఆలోచనలతో పొడిచా వెన్నుపోటు...
నిన్ను మట్టు బెట్టా పూరించా నాగరికత శంఖారావం...
గడిచిన గతమంతా మేల్కొలిపే వాసంత సమీరమై...

నిర్లిప్తత నిండిన మస్తిష్కపు దోనె చేపట్టే నాగరికత ...
నిన్ను చేజేతులా కబళించాను రాబందునై ..
నేడాయే నా జీవనం కల్లోలసంద్రం...
పుట్టుక నుండి పుడకల వరకు నా తోడు నీవు...

మన్నించమ్మా, పట్టాలు తప్పిన బ్రతుకును ఉద్ధరించు...
చినుకై చేరి పరచవమ్మా పచ్చని తివాచీ...
మౌనాన్ని ఆశ్రయించి మునిలా నేనున్నా నీకై వేచి...
నీ చల్లని చూపులు చిరుజల్లై నను తాకాలమ్మా..

-సి. హేమలత
9666779103

ఏనుగు!

ఏనుగమ్మా ఏనుగు! నల్లని ఏనుగు!
ఎగరలేని ఏనుగు! ఎత్తైనా ఏనుగు.

చిన్ని కళ్ళున్న ఏనుగు! చేట చెవుల ఏనుగు
చెట్లు విరిచే ఏనుగు! చల్లని నీళ్ళలో ఏనుగు

లక్ష్మీదేవికి ప్రియమైన ఏనుగు
లంబోదరుడి శిరస్సుగా ఏనుగు.

పాలిచ్చి బిడ్డఉ చక్కగా పెంచే ఏనుగు
పదికాలాలు గర్భంలో మోసే ఏనుగు.

అంగుళం మందం చర్మమున్న ఏనుగు
అంకుశం పోటుతోగాని కదిలే ఏనుగు.

దేవుడి ఊరేగింపులో ఉత్సవ ఏనుగు
దళంగా రాజుల యుద్ధాలలో ఏనుగు.

మొసలికి నీటిలో చిక్కిన ఏనుగు
మోక్షాన్ని పొందిన గజేంద్ర ఏనుగు!

-డా॥కందేపి రాణీప్రసాద్
98661 60378

పుస్తక సమీక్ష

జాతీయ కవి సినారె- ఆచార్య కసిరెడ్డి

"మనసుకు తొడుగు మనిషి
మనిషికి ఉడుపు జగతి
ఇదే విశ్వంభరా తత్త్వం
ఇదే అనంత జీవిత సత్యం"

తెలుగు సాహిత్యంలో జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డా॥ సి. నారాయణరెడ్డి, **'కాలమనే కావ్యంలో చెక్కిన అక్షర శిల్పం'**లా జీవిస్తూనే ఉంటారు. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, జాతీయ కవి సినారె సమగ్ర సాహిత్యాన్ని వ్యాస సంపుటిగా, మహాకవి, సాహిత్య ప్రతిభామూర్తిమత్త్వంగా ఆవిష్కరించారు. **'అక్షరాంజలి'**తో ఆరంభమైన వ్యాసాలలో ప్రాంతీయ, జాతీయ, విశ్వజనీనత, సమ్మిళితమైన సినారె రచనలను, ప్రధానంగా భారత జాతీయత మహోన్నతాతత్త్వాన్ని, ఆచార్య కసిరెడ్డి అద్భుతంగా విశ్లేషించారు.

'ఆధునికాంధ్ర కవిత్వం: సంప్రదాయాలు- ప్రయోగాలు' సిద్ధాంత గ్రంథం డాక్టరేటు పొందిన సినారె, స్వేచ్ఛా యువకవిగా సొంత గళాన్ని వినిపించారు.

ప్రతులకు: ఆచార్య కసిరెడ్డి
12-5-91/101,
సాయినివాస్
విజయపురి, తార్నాక
సికింద్రాబాద్-500 017.
సెల్: 9866956250

నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, విశ్వనాథ నాయుడు వంటి గేయ కావ్యాలు, జలపాతం, మధ్యతరగతి మంద హాసం, మంటలు-మానవుడు, కవిత నా చిరునామా ఎన్నో కవితా సంపు టిలు, నృత్య గేయ రూపకాలు, వ్యాస సంకలనాలు, గజల్లు, అనువాదాలు, ఖండకావ్యాలు, ముక్తక కావ్యాలు, 2016లో 'నా రణం మరణంపైనే' 2017లో వెలువడిన 'కలం అలిగింది' తో మొత్తం 92 గ్రంథాలు సినారె సమగ్ర సాహితీ వైదుష్యాన్ని ఆచార్య కసిరెడ్డి కళ్ళకు కట్టించారు.

'రాస్తూనే వుంటాను మిత్రమా నా నిండు గుండె చివరి గంట మోగేదాక" అంటూ కాలంతో కవితా ప్రస్థానం కొనసాగించిన, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, మహాకవి డా॥ సినారెకు, తన సిద్ధాంత గ్రంథ పర్యవేక్షక గురువైన అమర సాహితీమూర్తికి ఆచార్య కసిరెడ్డి కరదీపికల వంటి వ్యాసాలతో అక్షరాంజలి ఘటించారు.

-జయసూర్య
సెల్:9014948336

సునందామృతం

గృహ మార్జాల న్యాయము

గృహం అంటే ఇల్లు. మార్జాలం అంటే పిల్లి. పిల్లి ఇంటిని కనిపెట్టుకుని ఉంటుంది. కానీ దానికంతగా గౌరవం ఇవ్వం. ఏనుగు బయట ఉన్నప్పటికీ దానికి ఎంతో గౌరవం ఇస్తాం.

కారణం ఎందుకో వేమన పద్యంలో చూద్దాం.

ఉన్న ఘనతను బట్టి
మన్నింతురే కాని/ పిన్న పెద్ద
తనము నెన్నబోరు/వాసుదేవ విడిచి వసుదేవు
నెంతురా/ విశ్వధాభిరామ వినురవేమ.

ఇందులో వ్యక్తి చేసే పనులను, అతనిలోని ప్రతిభను బట్టి సమాజంలో కీర్తి ప్రతిష్టలు, గౌరవం లభిస్తాయి. అంతే గానీ అతడు వయసులో చిన్న లేదా పెద్ద అనే విషయాన్ని పరిగణనలోకి తీసుకోరు.

వాసుదేవుడు అంటే శ్రీకృష్ణుడు. వసుదేవుని కుమారుడు. అయితే వసుదేవుడు, వాసుదేవుడు తండ్రీ కొడుకులు. వయసులో పెద్ద వాడు కదాని వసుదేవుని గౌరవిస్తారా, కీర్తిస్తారా... అలా చేయరు కదా! ఎంతో ప్రతిభ ఉండి ఎన్నో ఘనకార్యాలు చేశాడు కాబట్టి చిన్నవాడైప్పటికీ శ్రీకృష్ణుడినే కొలుస్తారు.

ఇక్కడ గ్రహించ వలసింది ఏమిటంటే పిల్లి, ఏనుగు రెండూ జంతువులే. అపిల్లి మన ఇళ్ళలో తిరిగేదే. వాటిని చిన్నా పెద్దా అనే తేడా పక్కన పెడితే ఏనుగు ప్రత్యేకమైన లక్షణాలతో గౌరవింపబడుతుందనేది మనకు తెలిసిందే.

అలాగే మనుషులు కూడా ...చిన్నా, పెద్దా, వర్గ వర్ణ భేదం లేకుండా తమ తమ ప్రతిభ, సామర్థ్యాలతో కూడిన వ్యక్తిత్వాలతో మాత్రమే గౌరవం పొందుతారనేది ఈ గృహ మార్జాల న్యాయము ద్వారా తెలుసుకోవచ్చు.

ఇదే విషయాన్ని ఉదహరిస్తూ రాసిన మారద వెంకయ్య గారి భాస్కర శతక పద్యం చూద్దాం.

పండితులైన వారు ది
గువందగ నుండగ నల్పు
డొక్కడు/ద్దండత బీరమెక్కిన
బుధ ప్రకరంబుల కేమి యెగ్గగున్/ కొండొక
కోతి చెట్టు కొనకొమ్మనుండగ క్రింద గండభే/
రుండమదేభ సింహ నికురంబులుండవె చేరి
భాస్కరా! ఈ పద్యం యొక్క భావం:- పండితులైన వారందరూ కింద కూర్చుని ఉండగా ఒక అల్పుడు అంటే విద్యా, జ్ఞాన హీనుడు అగ్రాసనం/ ఉన్నత స్థానం మీద కూర్చున్నంత మాత్రాన పండితుల విలువేం తగ్గదు. ఎందుకంటే మదపు టేనుగులు, సింహాలు, గండభేరుండం లాంటి పక్షులు చెట్టు కింద ఉండగా చెట్టు కొన కొమ్మల మీద కోతి తిరుగుతూ ఉంటుంది కదా!

ఇంట్లో వారైనా అంటే బంధువర్గం వారైనా, తెలియని వారైనా వారి వారి పనులు, ప్రవర్తన, ప్రతిభా సామర్థ్యాలచే మాత్రమే లోకంలో కీర్తి ప్రతిష్టలు గౌరవం పొందుతారనేది గ్రహించాలి. ఇలాంటి వాటికి ఈ గృహ మార్జాల న్యాయము న్యాయం సరిగ్గా సరిపోతుంది.

-పురిమళ్ల సునంద
9441815722

భేటీ బచావో-భేటీ పడావో...

కథ

ఏగిలివారంగ పాచీ పనికెళ్లిన వత్సల ఎంతకూ రాకపాయే. నిత్తె తొమ్మిదెగేబేల్లకు ఇంటికొచ్చేదిది. గీయాల్ల ఇంకా ఎందుకు రాకపాయె. ఏమాయనో ఏమౌనని నాకు పిచ్చిపిచ్చి సోంచులు సురువాయె.

గీ నడ్మ ఎక్కడ వడ్తే కక్కడ మెడలకెంచి పుస్తెలు తెంపుకుపోకడ, ఆడోళ్లను సతాయించుడు గిట్ల అవారగాండ్లు ఎక్కువైపోతున్నారని టీవీల్లా నిత్తెం సూపిత్తాండ్రు. ఒక్కోసారి గీ పట్నంల బతికే కన్న మారుమూల నుండే పల్లెల్ల బతుకుడే సుఖమనిపిత్తాంది.

నేను గిట్టి పిచ్చి సోంచుల ఉండంగావే రెండు సేతులల్ల రెండు వజనున్న బస్తలు పట్టుకొని అలసిపోయిన ముఖంతోని అస్తున్న వత్సల కనబడంగానే ఉరుకుతపోయి ఒక సేయిల బస్త తీసుకుంటు "ఇదేంటే వత్సలా? గీయాల్ల గింత పగలుజేస్తివి. పొద్దునెత్తిమీది కొచ్చేయాల్ల అయింది. గంటసేపటి కెంచి నీ రాక కోసం కండ్లల్ల వొత్తులేసుకొని ఎదురుసూత్తున్న".

నా మాటలకడ్డు చెప్తూ "ఏం లేదయ్యా! గాడనేనొచ్చే తొవ్వల రాములోని గుడికాన మళ్లితినో లేదో మన పిల్లల ఇస్కూల్ల సార్ కనవడి "అమ్మా! నీవు గా సన్నిధి- పెన్నిధి కవలమ్మాయిల తల్లివే కదా! మొన్న మీ పిల్లల్ని బడికి తెచ్చావు కదా! గానాడు చూశాను నేను." అని సార్ అడగంగనే.

"అవును సారూ నేనే" అన్నట్టు ఆ సాక్ ముఖం జూసిన "ఎందుకూ సారూ అన్నట్ల?"

"ఏం లేదమ్మా! గవర్నమెంట్ భేటీ బచావ్ భేటీ పడావో" అనే ఒక స్కీం తీసింది. ఈ స్కీం కింద ఓ స్వచ్ఛంద సంస్థ వాళ్లు ఏ ఆడ పిల్లలైతే బీదవాళ్లై చదువులో మంచి చురుకైన వారుంటారో అటువంటి ఆడపిల్లలకు పెద్ద చదువులు వారి ఖర్చులతోనే ఉచితంగా చదివిస్తారట. అయితే మీ పెద్దమ్మాయి పెన్నిది పేరు మేము సిఫారసు చేశాము. మీరొక వేళ సరేనంటే రేపు మీ ఇంటికి ఆ సంస్థ వాళ్లని తీసుకొని వస్తాం.

ఆ సార్ మాటలు పూర్తవక ముందే "గవన్నీ నాకేం సమజౌతాయి సారూ! మా పెన్నిటికి చెప్తా. ఒక యాల్ల గాయన సరే అంటే మేమే ఇస్కూల్ కొస్తాం సారూ" అని చెప్పొచ్చిన.

"గట్లనా! మరి నీ మనసుకేమనిపిస్తోందే".

"సారూ మాట విన్నప్పుడు నాకు సంతోషమే అనిపించింది గనీ, తొవ్వల సోంచాయించుకుంట వస్తోంటే మనసులవడ్తలేదు. నా మనసుల మనసు లేదు. కాకి పిల్ల కాకికి ముద్దన్నట్ల నా తల్లి పుట్టుకతోనే ఓ కన్ను కాయ కాసినట్లుగా ఉంది గని నా తల్లికి ఎన్ని తెలివితేటలున్నవో మన ఇంటి ఓనరవ్వ ఇంట్ల గదేదో 'కౌన్ బనేగా కరోడ్‌పతి' అనే దాంట్లో గాయెన ప్రశ్నలడిగీ అడగంగనే టకీమని జవాబులు జెప్తేడ్తి పొల్లువోకుండ. మన ఓనరయ్య మస్తుమెచ్చుకుంటడు. నా తల్లి చిన్నప్పటికెళ్లి గిప్పుడు పదో తరగతిల కొచ్చిందాక ఎప్పుడూ ఫస్టే. ఒక్క తరగతికే కాదు స్కూల్‌కే ఫస్ట్. గసుంటి నా బంగారు కొండను ఊహూ ఒద్దయ్యా ఒద్దూ మనం పంపొద్దు' అంటు వత్సల బతిమాలుతుండె.

"ఓసీ పిసమొఖం వత్సలా! మన దెగ్గర పెద్ద సద్వులు సద్వించేంత పైసలెక్కడున్నవే. కూలి దొరికిన్నాడు నాలుగు పైసలు కన్వడ్తాయి. లేదంటే నీవు పాచీ పనికెళ్లిన్నాడు తెచ్చే ఇంత అన్నం మెతుకులు, అదేదో మన ఇంటాయన మన ఊరోడై గీట్ల వాచ్‌మెన్‌గా వెట్టుకొని గింత నీడిచ్చిండు కావట్టి సరిపోయింది. లేకుంటే గీ పట్నంలో మనకు అసరెక్కడిదే. మన బిడ్డలు పెద్ద సద్వులు సద్వి గొప్పోల్లైతే మనకే పేరోస్తది. నువ్వేం గాబరపడకు మనం రేపొద్దున బడికెల్దాం సార్ని కలిసి మాట్లాడుదాం. ఏం చెప్తడో చూద్దాం."

> "సారు మాట విన్నప్పుడు నాకు సంతోషమే అనిపించింది గనీ, తొవ్వల సోంచాయించుకుంట వస్తోంటే మనసులవడ్తలేదు. నా మనసుల మనసు లేదు.

వత్సలకు నేను చెప్పనైతే చెప్పిన గని నాకేం సమజవుతలేదు. వాళ్లను కన్నప్పుడెంతో బాధపడ్డ. ఇద్దరూ ఆడపిల్లలే పుట్టిరని గని మా యవ్వ జెప్పె "బిడ్డ ఆడదంటే ఆదిశక్తిరా, ఇంటికి మహాలక్ష్మిలొచ్చింద్రురా సిద్దయ్యా!" అని అనేక సుద్దులు జెప్పి గా బాధను దూరం జేసింది. ఏదో నాకు తోచిన కాడికి కాయా కష్టం జేస్తూ ఇంటి యజమాని సహకారంతో పిల్లలకు గీ పదో తరగతి దాంక నెట్టుకొచ్చిన. గని ఆపై సద్వులకు ఫీజులెట్ల తేవాలే, వాళ్ల బట్టలు ఖర్చులూ లెట్లనో" అని గిట్ల సోంచుజెసుకుంట నిదరవోతే గప్పుడే తెల్లరిపాయె.

ఎప్పటి లెక్కనే వత్సల పాసి పనికి వాయే పిలగాండ్లు ఇస్కూల్లకు వోయిరి. గాయాల్ల వత్సల పాసిపనికెళ్లి జెర ఎల్లెమొచ్చె. ఇద్దరం గల్సి బడికివోతివి, గా ఇస్కూల్ల ఉన్న సారు మమ్మల్ని దూరం నుంచే చూసి "రండి రండి సిద్దయ్యా రండి" అని విలుస్తాండు.

గొంచెం దగ్గరికి వోంగనే "నమస్తే సారూ! నమస్తే" అనంగనే "రండి ఇట్ల కూచోండి" అంటూ గక్కడున్న బెంచీ చూపించె.

గట్ల గా బెంచీమీద ఇద్దరం కూసుంటూ "సారూ అంతా బాగే గని.."

నా అనుమానం పసిగట్టినోడల్లా "ఏంటీ! ఇంకేమైనా అనుమానమా? మీ డౌట్లన్నీ క్లియర్ జేసుకొండి వాళ్లని ఇప్పుడే పిలిపిస్తా" అని నాకు చెప్తూనే ఆ సంస్థ వాళ్లకు ఫోన్ జేసి మాట్లాడి "సిద్దయ్యా! వాళ్లిప్పుడొస్తారట, కొద్దిసేపు కూచోండి" అని చెప్పి సారు ఏదో క్లాసులకు వోయిండు.

గట్ల జెప్పంగనే గట్లనే కూసున్నం. ఒక పావుగంట అయ్యిందో లేదో గా సంస్థోల్ల రావటం నాకూ వత్సలకున్న అనుమానాలన్నీ తీర్చుకొని వాళ్ల పని మీద పూర్తి భరోసా అనిపించి "సరే సార్లూ నా బిడ్డను మీచేతిలో పెడ్తాం అంతా మీ దయ" అని వత్సల చెప్తుంటే నా బిడ్డను అత్తగారింటికి అప్పజెప్పినంత దుఃఖమనిపించి నా కండ్ల గుడ్ల నిండ నీళ్లు నిండే. గిది వత్సలకు ఏర్పడకుండా కండ్లు తుడుసుకుని ఇంటికొచ్చేసినమం.

ఇంకా గీ మాట సుత జెప్పిరి. "ఈ పదో తరగతి పరీక్షలకు నెల ముందుకు మా దగ్గరికి తీసుకెల్తాం. అక్కడ సద్వుకొన మంచి సౌకర్యముంటది. ఇంకా మార్కులెక్కువొస్తాయనిరి". ఆ మాటకు కూడా సరేలే అన్నట్లు తలకాయ లూపాము.

వారన్నట్లనే ఆ నెల ముందు సన్నిధిని తీసుకెళ్లిండ్రు. ఇగ వాళ్ల ఇస్కూల్ వార్షికోత్సవంలో చిన్నతల్లి పెన్నిధిది భరత నాట్యముందని తెలిసి మా ఇంటి యజమాని పిల్లలతో బాటు మేమిద్దరం సుత వెళ్తిమి. అప్పుడే లోడస్ ఫీకర్‌లో చెప్తున్నారు. "ఇప్పుడు టెన్త్ క్లాస్ అమ్మాయి సన్నిధి చేసే అద్భుతమైన భరతనాట్యం చూడబోతున్నారు" అంటూ అది విని నా చిట్టి తల్లీ రాక కోసం యెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్న. అంతట్లనే స్టేజీ తొలగించగానే ఆ స్టేజీ మీద బొమ్మ లెక్క నిలబడ్డ నా తల్లిని చూసి నేను నమ్మలేకపోయా! అసలు గీ తల్లి నా బిడ

సమాచార లోపం

కథ

నరసింహపురం లోని రామయ్య ,ఆనందయ్య ఇద్దరు ప్రాణ స్నేహితులు. వారి మనవళ్ళు తమ ఆటను చూడడానికి మైదానంలోనికి వారిని రమ్మని ఆహ్వానించారు. వారిద్దరూ మరునాడు సాయంత్రం ఆ ఆట మైదానానికి కలిసే వెళదామని నిర్ణయించుకొన్నారు. అక్కడికి దగ్గర్లోనే ఉన్న శేషయ్య గారింట్లో వారిద్దరూ కలుసుకోవాలని అనుకున్నారు . రామయ్య మరునాడు సాయంత్రం శేషయ్య గారి ఇంటికి వెళ్ళాడు. కానీ ఎంతసేపు ఎదురు చూసినప్ప టికిని ఆనందయ్య జాడనే లేదు. చేసేది లేక రామయ్య తన ఇంటికి మరలి వచ్చాడు.

ఆ తెల్లవారి ఆనందయ్య రామయ్యకు సంతలో కలిశాడు. రామయ్య అతనితో " మిత్రమా ! నీవు నిన్న మన మనవళ్ల ఆటలు చూడడానికి వెళ్ళదామని అన్నావు. కానీ నీవు శేషయ్య గారింటికి రానేలేదు. నీకోసం నేను ఆ శేషయ్య గారి ఇంట్లో ఎదురుచూసి చూసి మరలి వచ్చాను తెలుసా" అని అన్నాడు. అప్పుడు ఆనందయ్య " అయ్యో మిత్రమా ! నీవే రాలేదు. నేను ఆ శేషయ్య ఇంట్లోనే నీ కొరకు వేచి చూశాను తెలుసా! చీకటైనా నీవు రాకుంటే నేనే ఇంటికి మరలి వచ్చాను "అని అన్నాడు. "ఈ అబద్ధాలు ఎందుకు మిత్రమా!" అని అన్నాడు రామయ్య. "నీవే అబద్ధాలు ఆడుతున్నావు "అని అన్నాడు ఆనందయ్య.

ఇంతలో తాను ఎదురు చూసిన ఆ ఇంటి శేషయ్య అటువైపు వెళ్లడం చూసిన రామయ్య అతన్ని పిలిచాడు. " ఏమయ్యా శేషయ్యా! నేను మీ ఇంట్లో నిన్న సాయంత్రం నుండి రాత్రి వరకు ఇతని కొరకు ఎదురు చూశానా లేదా ! నిజం చెప్పు " అని అన్నాడు . "ఔను. చూశారు " అని అన్నాడు ఆ శేషయ్య. అప్పుడు ఆనందయ్య " అయ్యో! ఆ శేషయ్య ఈయన కాదు . మరి నేను కూడా ఆ మైదానం దగ్గరి శేషయ్య ఇంట్లోనే ఎదురు చూశానే "అని అన్నాడు.

ఇంతలో ఆనందయ్య చెప్పిన ఆ శేషయ్య కూడా అటువైపు వెళ్లడం చూసిన ఆనందయ్య అతన్ని పిలిచాడు . "ఓ శేషయ్యా! ఈ రామయ్య కోసం నిన్న సాయంత్రం నేను మీ ఇంట్లో ఎదురుచూశానా! లేదా! నిజం చెప్పు" అని అన్నాడు. 'ఔను. చూశారు' అని అన్నాడు ఆయన. అప్పుడు రామయ్య " అయ్యో! నాదే తప్పు. నేను ఆ ముందటి శేషయ్యని అనుకున్నాను. అక్కడనే నీకోసం ఎదురు చూశాను" అని అన్నాడు . అప్పుడు ఆనందయ్య" నాది కూడా తప్పే. నేను నీవు చెప్పినది ఈ శేషయ్యనే అనుకొని ఈయన ఇంటిలో నీ కోసం ఎదురు చూశాను"అని అన్నాడు.

అప్పుడు రామయ్య ఆనందయ్యతో "మనం వారి ఇంటిపేర్లు చెప్పుకోకపోవడం పెద్ద తప్పు అయింది . మొదటి ఆయన సహకారం శేషయ్య. ఈయన ఉపకారం శేషయ్య. ఆ ఇద్దరి ఇండ్లు ఆ మైదానానికి దగ్గర్లోనే ఉన్నాయి. మనం వారి ఇంటి పేర్లు చెప్పుకోక పోవడం వల్ల ఈ పొరపాటు జరిగింది'' అని అన్నాడు. ''ఔను ''అన్నాడు ఆనందయ్య . వారిద్దరూ నవ్వుకొని మరొకసారి ఈ పొరపాటు చేయవద్దని ఇకముందు సమాచారం ,చిరునామా వివరాలు సరిగా ఇచ్చి పుచ్చుకోవాలని అనుకున్నారు.

-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535

ఆత్మాభిమానం

ఆత్మాభిమానం జీవాత్మకు శ్వాస
సామాజిక జీవధారలకు బాస.
ఆత్మాభిమానం లేని దేహం
తల లేని మొండెమే !.
ఆత్మ గౌరవం సర్వప్రాణులకు
ఆత్మాభిమానమే !.
ఆదరిస్తే అభిమానం ఆభరణమే!
అవమానిస్తే అవకాశం శాపమే !.
ఆత్మగౌరవం గాయపడితే
అక్కడ నిశ్శబ్ద విప్లవమే !.
పులి వెనుకడుగు వేసింది అంటే
పంజా దెబ్బ ఏమిటో చూపడానికే!.
విల్లు వంగిందంటే
తల దించుకున్నట్లు కాదు!.
అది శరాన్ని ఎక్కు పెట్టడానికే !.
ఆత్మాభిమానం అంటే
శమీ వృక్షం పై దాచిన పాశుపతాత్రమే

-పి.బక్కారెడ్డి, 9705315250

తన రచనలతో ఆదర్శంగా నిలిచిన 'కట్టమంచి'

సభలో ప్రసంగిస్తున్న ఉప్పల శ్రీనివాస్

తన రచనలతో అన్ని తరాలవారికి కట్టమంచి రామలింగారెడ్డి ఆదర్శంగా నిలిచారని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. మంగళవారం త్యాగరాయ గాననభ ఆధ్వర్యంలో శతాబ్ది పూర్వ మహనీయుల యాది లో భాగంగా బహు ముఖ ప్రజ్ఞా శాలి కట్టమంచి రామ లింగా రెడ్డి జయంతి గాననభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షతన జరిగింది. ఉప్పల శ్రీనివాస్ మాట్లాడుతూ 1926 లో స్థాపించిన ఆంధ్ర విశ్వ విద్యాలనికి ప్రథమ వీసీగా నియమితులై సంస్థకు మంచి పేరు తెచ్చారన్నారు. పొత్తూరి సుబ్బారావు, అంజిబాబు, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వందేళ్ళనాడే సమాజ రుగ్మతలను విమర్శించిన ఉన్నవ

సభలో ప్రసంగిస్తున్న గుదిబండి వెంకటరెడ్డి.

వందేళ్లనాడే మాలపల్లి నవల రాసి సమాజంలోని రుగ్మతలను విమర్శించిన ఉన్నవ లక్ష్మీనారాయణ సామాజిక చైతన్య రచయిత అని వక్తలు పేర్కొన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో ఆదివారం శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా సామాజిక చైతన్య రచయిత ఉన్నవ లక్ష్మీనారాయణ సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షతన జరిగింది. గీత రచయిత వడ్డేపల్లి కృష్ణ మాట్లాడుతూ తెలుగు నవలా సాహిత్యంలో ఉన్నవ లక్ష్మీనారాయణకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఆయన రచయితగానే కాకుండా గాంధీ పిలుపును అందుకుని దీన జన ఉద్ధరణకు కార్యచరణ చేపట్టిన మహనీయుడన్నారు. కళాపోషకులు జి. వెంకట్‌రెడ్డి, సూరి భగవంతం ట్రస్ట్ స్థాపకుడు ఎస్.బి.రామ్, సమాజ సేవకుడు వైకుంఠం పాల్గొన్నారు.

కణిక

అడ్మిన్: రమాదేవి కులకర్ణి
8985613123

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక

'బుధవారం బాద్షా'

(ప్రథమ)

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ

అహం

ఎందుకో తెలియటం లేదు
"నేను" అనే అక్షరాల కలయిక
మదిలో
ఓ అహంకార జ్వాలనే రగుల్చుతుంది.
స్థిరం లేని
రెండు రూకలు కరచాలనం చేయగానే
ప్రపంచమే అరచేతిలోకి వచ్చి
తాను చెప్పినట్టు
ఆడుతున్నట్టు ఊహాలోకాన్ని నిర్మిస్తుంది..
పొగడ్త శ్రవణేంద్రియాలను తాకగానే
మేరు పర్వతం కూడ తన ముందు
ఓ చిరు గులకరాయన్న భావన మదిలో
ఊప్పెనై ఎగిసిపడుతుంది...
నేను అన్న పదం
అందరిలో ఒంటరితనాన్ని
ప్రేరిపించి..
సత్వగుణాన్ని పారద్రోలి
రజోగుణంతో స్నేహం చేసి..
స్థానమిచ్చిన ఎదని కన్నీటి కడలిలో
ముంచి పారిపోతుంది..
నేనెవరన్న ప్రశ్నని
పశ్చాత్తాపానికి విడిచి...
ఓటమి జెండా ఎగురవేసి..
ఆదిలోనే పంచేంద్రియాలకు
కళ్లెం వేస్తే
అందరిలో మెరిసే
వజ్రమౌతుంది "నేను"

-శ్రీదేవి సురేష్ కుసుమంచి

నేను

నేను
అనుకొంటే,
నాలో విపరీతమైన అహం,
దానితో పొంగి పొర్లుతున్న రక్తం
దేహం నిండా !
ఉరుకులు పరుగులు తీస్తుంటే ,
జనించి
రహించే అతిశయం,
కన్ను మిన్ను కానక !!.
బుసలు కొడుతున్న నాగులా
పడగ విప్పి,
నాలుక చాచుతు
నలు దిశలను గడగడలాడించి
గర్వముతో పొట్టేలును
తన్నుకు పోయి గగనంలో
విలాసంగా విహరించే గద్దలా
మనసు మురిసి పోదూ!!.
అమావాస్య నిశి
కసిగా అలుముకొని
వనమంతా మసి పూసినట్టు,
మెదడంతా మసకబారి
మమతలు వాడి పోయి
మోసం మోహరిస్తుంది !.
అనురాగాలను కనుమరుగు చేస్తు
ఆధిపత్య ధోరణి
అమానుషత్వాన్ని పులుముకొని
అందలమెక్కాలని చూస్తుంది!.
అదే..... నేను
నా లోలోపలికి తొంగి చూసుకుని,
మనిషినని,
మానవత్వం అలదుకొనిన
మహోన్నత జన్మ ఇదని
గ్రహించి
నేనేంటో తెలుసుకొన్న
మరుక్షణం
సమస్త జీవరాశులలో
నిక్షిప్తమై ఉన్న
జీవాత్మ,
దానితో అనుసంధానమై యున్న
పరమాత్మ
బోధించిన కరుణా రసం
నరనరాల్లో ప్రవహిస్తుంది !!
బాధితులు, తమ హృదయం లో,
ఎగిసిపడే జ్వాలలను భరించలేక,
శోకంలో కార్చే కన్నీటినై జారి
ఆర్పివేసే గంగనౌతాను!!.
గులాబి పువ్వుల్లా
ఘుమఘుమలాడే సువాసనలు వెదజల్లుతూ
ప్రపంచంలో
ప్రేమకు పట్టాభిషేకం చేసి,
పగ ప్రతీకారాలను
నామ రూపాలు లేకుండా
పాతాళంలో సమాది చేస్తా !!.
దోపిడీ దొంగల్లో
కనువిప్పు కలిగించే
విజ్ఞాన జ్యోతిని
ఆత్మ జ్యోతితో ఆత్మీయంగా వెలిగించి,
మగువల బలాత్కారం చేసే
మదాంధుల మదం అణిచే
మార్తాండుడినై మలమల మాడ్చేస్తా!!.
శాంతి సహనం సద్భావన
న్యాయం ధర్మం సత్యం
నాలో,
నిలువునా నిగ నిగ లాడితేనే నేను.

- కేశరాజు వేంకట ప్రభాకర్ రావు
పాతర్లపాడు, ఖమ్మం

కవిత్వం!!

మనసొక మహాకవిగా
భావుకతను నింపుకుంటే..
అందాల పదబంధాలతో
రూపుదిద్దుకుంటుంది కవిత్వం !!

అక్షరాలతో కొత్తలోకాలను ఆవిష్కరిస్తుంది..
వేవేల ఊహలకు కమనీయ రూపం కల్పిస్తుంది !!

కలలతో కవనాలకు కాటుకలు దిద్దుతుంది..
గతాలను జ్ఞాపకాలను అక్షరీకరిస్తుంది !!

సుఖసంతోషాలను సుందరీకరిస్తుంది..
దుఃఖాలలో ఓదార్పు తానై సేద తీరుస్తుంది !!

శృంగారానికి సౌందర్యాలను అద్దుతుంది..
అనుభవాల భావాలను నిరంతరం పండిస్తుంది !!

అక్షరాలలోనే యావత్ ప్రపంచాన్ని చూపిస్తూ..
ప్రకృతిలోని పరవశాలకు ప్రాణం పోస్తుంది !!

అన్యాయాలను ఎదిరించే గేయమవుతుంది..
అక్రమాలను దునుమాడే కథనమై స్ఫూర్తినిస్తుంది !!

దుర్మార్గపు దురాచారాలను ఎండగడుతుంది..
దుర్నీతి పోకడలను దునుమాడే శక్తి తానవుతుంది !!

కదనంలో కరవాలమవుతుంది కవి చేతిలో కలం..
కవిత్వమే వీరత్వమై పదాలతో కదం తొక్కుతుంది !!

భాషాసంపదల విలువలు పెంచుతుంది కవిత్వం..
ప్రపంచ చరిత్రలో విజ్ఞాన ఖనిజాలను నింపుతుంది !!

కాలాలు గతించిపోతున్నా గతించదు కవిత్వం..
సాగిపోతూనే ఉంటుంది ఆగకుండా మున్ముందుకు..

వినూతన రూపాలను సంతరించుకుంటూ..
కాలానుగుణంగా కొత్తకొత్త పుంతలలో !!

-పేరిశెట్టిబాబు
9247170800

తల్లిదండ్రుల ప్రేమ

కథ

అనగనగా చింతపల్లి అనే గ్రామంలో ముత్యం, రజిని అనే ఇద్దరు దంపతులు ఉండేవారు. వాళ్లకు ఇద్దరు కొడుకులు వారి పేరు కిరణ్, అరుణ్. దంపతులిద్దరూ కొడుకులను అల్లారి ముద్దుగా పెంచసాగారు. తండ్రి ముత్యం దొరికిన కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని సాదసాగాడు. తల్లి రజిని కూడా కూలీ పనులు చేస్తూ ఉండేది. కిరణ్, అరుణ్ లను మాత్రం రోజు బడికి పంపిస్తూ, చక్కగా చదివించేవారు. దంపతులిద్దరూ ఎంత కష్టపడ్డా బిడ్డలకు మాత్రం లోటు లేకుండా చూడసాగారు. అప్పులు చేసి మరి బిడ్డలను పట్నంలో చదివించారు.

కిరణ్, అరుణ్ లకు పట్నంలో పెద్ద ఉద్యోగాలు వచ్చాయి. డబ్బులు బాగా సంపాదిస్తూ, పెద్దపెద్ద కంపెనీలు పెట్టుకొని, హైదరాబాదులోనే వివాహం చేసుకొని ఉండసాగారు. ఇద్దరు కూడా పుట్టిన ఊరికి రావడం మానేశారు. ఊర్లో ఉన్న ముత్యం, రజనీలకు అప్పుల భారం ఎక్కువై ఉన్న ఇంటిని అమ్మేసి అప్పులు కట్టేశారు. భార్యా పిల్లలతో ఉన్న తమ కొడుకుల చిరునామా తెలుసుకొని దంపతులు ఇద్దరు పట్నం వెళ్లారు. మాసిన బట్టలతో వచ్చిన తల్లిదండ్రులను చూసి కిరణ్, అరుణ్ లు కోప్పడ్డారు. ఇలా మాసిన బట్టలతో మీరు రావడమే కాకుండా రేపటి నుంచి మీరు ఇక్కడే ఉంటే మా పరువు ఏం కావాలి. మేం వ్యాపారాలు చేసుకోవద్దా! తిరిగి మీరు ఊరికి వెళ్లండని కొంత డబ్బులు ఇచ్చి పంపించారు.

కానీ ముత్యం, రజనీలకు ఊరికి వెళ్లాలని అనిపించలేదు. పట్నంలోని బస్టాండ్ వద్దనే ఉన్నారు. బిడ్డలలో మార్పు వచ్చినందుకు దుఃఖించసాగారు. కిరణ్, అరుణ్ సాయంకాలం ఇంటికి వెళ్లగానే వారి బిడ్డలు మురికి బట్టలతో ఇల్లంతా తిరగసాగారు. మురికి బట్టలతో తిరుగుతున్న బిడ్డలపై కోపగించుకున్నారు. మాకు మురికి అంటేనే చాలా ఇష్టం అంటూ పిల్లలు గంతులు వేయసాగారు. కిరణ్, అరుణ్ లు తమ తప్పు తెలుసుకున్నారు. తమ తల్లిదండ్రులను వెతుక్కుంటూ వెళ్లి బస్టాండ్ లో ఉన్న వారిని గట్టిగా హత్తుకున్నారు. అయ్యో బిడ్డలారా! మా మురికి మీ బట్టలకు అంటుతుంది అంటూ ముత్యం, రజిని లు అన్నారు. తమ తప్పుకు క్షమించమని కొడుకులిద్దరూ వాళ్ళ పాదాలపై పడి నమస్కరించి వారిని తమ ఇంటికి తీసుకెళ్లారు. తాత నానమ్మల వద్దకు పరిగెత్తి వెళ్లి మనుమలు మనుమరాలు హత్తుకోవడం చూసి కిరణ్ అరుణ్ లు సంతోషించారు.

నీతి: మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులను ఆదరించాలి. కానీ అవమానపరచకూడదు.

-అర్పిత, ఏడవ తరగతి జడ్‌పిహెచ్‌ఎస్
హవేలీ ఘనపూర్, మెదక్ జిల్లా
9494061649

ఆహ్వానం

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ
మరియు పాలపిట్ట బుక్స్ ఆధ్వర్యంలో
జి. ఉమామహేశ్వర్ కథల సంపుటి
నెమలీకలు-నెమరువేతలు

పరిచయ సభ

అధ్యక్షులు
డా. ఏనుగు నరసింహారెడ్డి
ముఖ్య అతిథి
సమ్మెట ఉమాదేవి
విశిష్ట అతిథి
మామిడి హరికృష్ణ
గౌరవ అతిథి
సుధాకర్ నీల్
ఆత్మీయ అతిథులు
కోడూరి విజయ్‌కుమార్
గుడిపాటి

వేదిక: రవీంద్రభారతి మినీహాలు, హైదరాబాద్
తేదీ: ఆదివారం, 17 డిసెంబర్ 2023
ఉదయం 10.30 గంటలకు
అందరూ ఆహ్వానితులే

కర్మ శుద్ధి కార్మికులు

నిశ్శబ్ద అమ్మ చీకటి గర్భం
ఉమ్మ నీటి అలజడులు
ఎన్ని వున్నా ఉల్బము
ఊరడింపు ప్రశాంత పలకరింపు
ఉనికిలో మరెక్కడా కానరాదు.
ఊహ తెలియక ముందు
ముర్రి పాలతో మొదలైన
మురిపాల ముద్దు ముచ్చట్లు.
ఊహ తెలిసాక మొదలయ్యే
లోకంలో అటు పోట్లు
కడలి పోటు పాటులతో
నిత్యం పోటీలే..
మనసు పడ్డ మది మందిరంలో
ముడి పడ్డ జ్ఞాపకాలు
ఇరు హృదయాల రాపిడితో
రాజుకున్న ప్రణయాలు
అనుకోని జీవన ప్రయాణాలు.
కవ్వింతల కారు మబ్బులతో
మసకబారుతున్న ప్రేమలు
మోహపు చూపుల కారు చిచ్చులో
బూడిద అవుతున్న బతుకులు
మనిషి విలువ తెలియని మనుషులు
మనసు లో తెరుగని స్వార్థ పరులు
బాధను రుచి చూపించే
గత జన్మ విరోధులు
సంతోషాలను పంచే స్నేహితులు.
బతుకు దారి పొడుగునా
నమ్మకాల దోపిడీలో
మనసునిండా మౌనపు మంతనాలో
కస్టాలో కన్నీళ్లో సుఖ దుఃఖాలో
పంచే ప్రతీ ఒక్కరూ
నీ కర్మ శుద్ధి కార్మికులే
ఆనందంగా ఆహ్వానించు
మంచి మనసుతో మన్నించి దీవించు

-దుర్గా మహా లక్ష్మి ఓలేటి
7702010056

అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక వికారాబాద్ వారం వారం నిర్వహిస్తున్న వాట్సప్ కవిసమ్మేళనంలో భాగంగా ఈ వారం 'విజయ్ దివస్' శీర్షికలో వచ్చిన కవితల్లో మేలైనవి కొన్ని..
నిర్వాహకులు -కమలేశ్
-దోరవేటి, అనంత వ్యవస్థాపకులు

అలుపెరుగని సాహస యాత్రికులు...

కొందికి బతుకుతెరువు
మరికొందరికి దేశభక్తి దరువు
అందరినీ కలిపింది మాత్రం
వందే మాతరం!.
క్షణాలను
రక్షణ చక్రంలో మదించి
శరీరాలనే ఆయుధాలుగా మలచుకున్న
మీ ప్రజ్ఞ
అనన్యసామాన్యం.
కుటుంబాలను
జ్ఞాపకాల అట్టడుగున దాచేసి
శస్త్రాలతో దోస్తీ చేసిన
మీ పరకాయ ప్రవేశం
ఒక ఇంద్రజాలం.
ప్రకృతి వైపరీత్యాలను
మోచేతులతో అడ్డుకుంటూ
మీరు చేసే సాహసకృత్యాలు
అనూహ్యమైన అద్భుతం.
యుగాలు మారినా
పగలను నియంత్రించలేని
పాలకుల హృదయహీనతలకు
తెలిసీ బలిపశువులుగా మారడం
మార్చలేని విడ్డూరం.
శత్రుభయంతో
అణ్వస్త్రాల కోసం
మిలియన్ల కొద్దీ ధనాన్ని కాల్చేసే దేశాలు
మైత్రి కోసం
అందులో పదోవంతైనా
ఖర్చు చేసే రోజు వస్తే....
మీరూ మాలాగే
సంతోషంగా జీవించగలరని
ఆశపడుతూ .
మీ అలుపెరుగని సాహసయాత్ర ను
తరచూ తలచుకుంటూ
పాదాభివందనం చేస్తుంటాను.

-దోరవేటి

వీర సైనికా వందనం

కఠినమగు యుద్ధ విద్యను
పటుతరముగ నేర్చినారు భారత వీరుల్
యెట నుండి వైరులొచ్చిన
పటపటమని పళ్లుంగొరికి పరిమార్చుటకున్
చం॥
ఇరువది మంది వీరులట
యిక్కడ ప్రాణము పోకముందరే
చెరగని ముద్ర వేయుటకు
చేసిన యుద్ధమునందు శత్రువుల్
మరణము నొందినారు
మనవారల కన్నను మిక్కుటంబుగా
గరువము గాదె! వీరులకు,
గాంచిన తల్లికిదండ్రికిత్తరిన్
మరుచుట సాధ్యమౌనె? మిము
మానసమందున దాచుకోరటే!.
తన యూరిని తన వారిని
తన బంధుజనమ్మునంత తగ బాసిన నా
తనువే దేశము కొరకని
ఘనముగ చాటిన యశుండు ॥కల్నలు॥
మరణమును మనువాడెడి వరమునొంది
భరతజాతిని కన్నీటి భాష్పమందు
మునిచిపోయిన మొనగాడు; ముందునీకు
మ్రొక్కులిడుదును సైనికా! మోదముగను.
స్వర్గలోకమ్ము పంపెనా? స్వాగతమ్ము
వీరులని కోరి మిమ్ముల వేగముగను
పిలువ దలచిన కారణంబేదియైన
జాతి జనుల మదిని గెల్చు ఖ్యాతిమాది.
చైనా యికనైనా తన
వైనాన్నే మార్చుకుంటె వరమౌనది; యే
దైనా తన వశమౌనని
సైన్యాన్నే పంపెనంటె చావే దిక్కౌ

-కమలేశ్
9160396596

తీర్చుకోలేని ఋణం

దేశం కోసం ప్రాణ
త్యాగానికి వెనుకాడవు,
దేశ రక్షణ కోసం
మండుటెండల్లో
వరదై పొంగే వర్షంలో
ఎముకలు కొరికే చలిలో
దేశ భద్రత కోసం
నీ గరుడ కళ్లతో పహారాకాస్తుంటావు,
శత్రువుతో పోరాటంలో
మీసం మెలేస్తూ కదన రంగంలో కోదమ
సింహమై గర్జిస్తావు,
కొన ఊపిరితో ఉన్నా
శత్రువుకు వెన్ను చూపక
నీ ఉక్కు పిడికిలిని బిగిస్తావు.
సతీ సుతులను విడిచి
మంచుకొండలను అధిరోహించి
సరిహద్దుల్లో నిలిచి..
మా సుఖసంతోషాల కోసం నీవు కష్టాలను
అనుభవించి.. ప్రాణాలకు తెగించి ఆనందిస్తావు,
భరతమాత ఒడిలో తుదిశ్వాస విడుస్తావు,
గర్వించేము నీ వీరత్వము చూసి,
ఏమిచ్చి తీర్చుకోగలము ఓ వీర సైనికా !!!

-సదీదుద్దీన్ అన్సారీ
వికారాబాద్

సైనికా! నీకు వందనం!

వందనం వందనం వీరసైనికా!
వందనమభివందనం భరతపుత్రకా!.
తల్లిదండ్రులను వదిలి
భార్యా పిల్లలను వదిలి
దుష్టమూకలను దునుమగ
ధైర్యము చేపట్టినావు!.
ఎండ వాన చలికోర్చుచు
గుండె నిబ్బరముగ దేశ
రక్షణయే ధ్యేయంగా
లక్ష్యము చేపట్టినావు!.
నిదురలేని రాత్రులెన్నో
నిను కలవరపెట్టినా
శత్రుసేన లనుక్షణము
పెను బాంబులు విసిరినా!.
మాతృదేశ రక్షణకై
ప్రాణాలను గనుతింపక
భరతావని యశస్సుకై
నీ స్వార్థముకొడిగట్టని
నీ సాహసమే భవితకు సస్యశ్యామలం!
నీ అకుంఠిత దీక్షయె
భరతకీర్తికి రక్షణకవచం!
నీ సంకల్ప బలమెమాకు
నిత్యం ప్రేరణాభరితం!
నీ త్యాగమె చరితలోన
ప్రాతఃస్మరణీయ పఠనం!!

-సుప్పని సత్యనారాయణ
9492626910

దేశభక్తులు

ఇరువది నాలుగు గంటలు
సరిహద్దును దాట కుండ సాహస మొప్పన్
పరదేశపు దుండగులను
బరిమార్చుచు నుండు వారు బాధ్యత తోడన్.
ఇంచుక యధైర్య పడకను
మంచును గురిసేటి చలిని మార్కొను చున్ మా
కంచెవు నీవై నిరతము
సంచారము సేయు వాడ సైనిక వీరా!.
ఉండేదట హిమ వంతము
గుండెలలో ధైర్యమెంతొ గూడును గట్టన్
కండలు పిడసలు గట్టిన
మొండిగ నీవుందువోయి మోదమ్మునుచున్!.
ఏ కాలము నందైనను
యాకలి దప్పులనెరుగక యవనీతలమున్
తేకువతో కాపాడెడు
శ్రీ కరుడే సైనికుండు జేసెద నతులే!.
కాపాడును దేశ ప్రజల
యాపద రానీయకుండ యన్నియు వేళల్!
చూపెట్టును తన భక్తిని
నోపికతో ముందుకేగు నొప్పెడి రీతిన్!.

-మహ్మద్ షరీఫ్
9866560527

మణిపూసలు

మీ కన్నా యోధులెవరు
మీ కన్నా భక్తు లెవరు?
జగతిలోన జై! జవాన్లు!
మీ కన్నా త్యాగు లెవరు?.
సరిహద్దుల రక్షకులు
ధైర్యమొసగు శిక్షకులు
మన దేశపు జై! జవాన్లు
శత్రుమూక భక్షకులు!.
సుఖంబులను ఎరుగలేరు
దుఃఖము మీరనను లేరు
విధిలోపల జై! జవాన్లు
వెనుకడుగులు వేయలేరు!.
దేశమాత దన్ను మీరు
భరతజాతి వెన్ను మీరు
సమరమందు జై! జవాన్లు
కదలనట్టి మిన్ను మీరు!.
నిస్వార్థ సేవ మీది
నిజాయితితోవ మీది
దేశముకై జై! జవాన్లు
అర్పించిన జీవి మీది!
మీ సేవలు మరువలేము
మీ త్రోవలు విడువలేము
రక్షణలో జై! జవాన్లు
మీరు లేక మేము లేము!

-వడిచర్ల సత్యం
7989511543

ఓ వీర సైనికా

దేశమే ప్రాణంగ దేహమే తృణముగా
భావించు సైనికా భరత వీర
చేతనే ధ్యేయంగా చేతలే సాయంగ
మమ్ము కాపాడెడి మహిమతోడ
సరిహద్దు రక్షకై సరిరాని విక్రమ
శౌర్యాన్ని చాటిన సాహసికుడ
విజయాలు తలవంచె విలువైన గమ్యాన్ని
ముద్దాడ నిరతంబు మురియు వాడ
విశ్రమించెను ప్రజ విడిది జేసినయట్లు
భోగభాగ్యమందె పొంగిపోతు
నిలువగలరె? జనులు యిలమీద కలలోన
నీవులేని నాడు నిమిషమైన

-ఆకుల మల్లికార్జున్
7416067335

భారత సైనికులు

దేహాన్ని పూలహారం చేసి
మనసును నైవేద్యంగా మలచి
భక్తితో దేశమాతకు అర్పిస్తరు.
శాంతి గీతం పాడుతూ
యుద్ధమొస్తే గెలుస్తూ
అవసరమైతే
మరణాన్ని వరంగా రాసిస్తారు.
సుఖం తెలియని శరీరాలు
భయం తెలియని గుండెలు
శత్రుమూకకు ఎదురు నిలిచి
పోరాడే సైనికులు.
గుండ్ల వర్షం గుండెను చీల్చినా
గుండె ధైర్యం సన్నగిల్లదు
ప్రాణం తనకు తృణప్రాయం
దేశరక్షణే సైనికుని ధ్యేయం.
మన ఇంట్లో మహా అయితే
పాలు మాత్రమే పొంగుతాయి
అతని ఇంట్లో ఒంట్లో
దేశ భక్తి ఉప్పొంగిపోతుంది.
అలసిపోని అతని శరీరమే
ఓ గొప్ప శక్తి
నిద్దుర పోని ఆ కంటిపాపే
నిశ్చలమైన దేశభక్తి

-సంజి.మల్లేష్
9542628014

అమరులకు ఏమివ్వగలం...?

హిమాలయాలు
మంచు దుప్పటి కప్పుకున్న వేళ
సూర్యుడు సైతం
చల్లని గాలులకు వణుకుతూ
ఆకాశంలో కనిపించని సమయాన
చేతిలో గన్ను
గుండె నిండా ధైర్యంతో
నిత్యం కవాతు చేస్తూ
దేశ రక్షణకు పూనుకుంటాడు సైనికుడు.
అతనిది అనునిత్యం యుద్ధమే
కొన్నిసార్లు శత్రువులతో
ఇంకొన్ని సార్లు ప్రకృతితో.
కాలం కలిసిరాక
కాలం చెందాల్సి వస్తే
ప్రాణాన్ని లెక్క చేయని వీరుడు.
ఇన్ని చేసిన అమరునికి
మనం ఏమివ్వగలం
అతడిని తలుస్తూ
ఒక కన్నీటి చుక్కను
అతనిని స్మరిస్తూ అక్షరాంజలి తప్ప

-కాట్ల శివకుమార్
9701970774

అజారామం

ఉగ్రకుట్రల ఊసరవెల్లి
సరిహద్దులు దాటి
శాంతి ఒప్పందాలను ఉల్లంఘించి
కాశ్మీర్ అక్రమించుకోవాలని చూస్తోంది
లక్షల మంది సైనికుల పోరాటం
అమరులైన భారతీయ సైనికుల
ఆత్మబలిదానం
నీతి తప్పిన ధమన నీతికి
కీలు ఎరిగి వాతపెట్టినట్టవుతుంది
అమరజ్యోతిలో
వీర సైనికుల వీరత్వం
భారత జాతి సార్వభౌమత్వాన్ని
సురక్షితనీ చేసిన
వీర సైనికులకు అమరత్వం
భారతజాతి మర్చిపోని
విజయదరహాసం
జయహో సైనికా!మీకు జోహార్
అఖండ భారతావని
వినమ్రంగా శిరస్సు
వంచి ప్రాణమిల్లుతుంది
ఈ నెలమీద మర్చిపోని
శిలాక్షరాలు మీరు

-ఉమాశేషారావు
9440408080

వందనం జోహార్

ఓ అమ్మ కడుపున పుట్టి
తోడబుట్టినోళ్ళకు దూరమై
తలిదండ్రులను విడిచి
కట్టుకున్న ఇల్లాల్ని
కన్నబిడ్డల్ని వదిలేసి
మాతృదేశాన్ని కాపాడగా
శత్రువులతో పోరాడుతూ
ప్రాణాల్నిసైతం లెక్కజేయక
దేశరక్షణే కర్తవ్యంగా నెంచిన
ఓ వీర సైనికసోదరా!...
ఏమిచ్చి నీ ఋణం తీర్చుకోగలం!.
మమతానురాగాల్ని వదిలి
మరణంతో దోస్తీ చేస్తూనే
మమ్ములను కంటికి రెప్పలా కాపాడి
మాకండగా నిలిచే ఓ జవాను
సహోదరా!...
స్వార్థాన్ని మరచి సర్వం త్యజించి
స్వాతంత్ర్య భరతావని సంరక్షణలో
తుపాకీని చేతబట్టినా
శత్రుసైన్యనే తూటాకి
బలైపోతున్న ఓ ఆపద్భాంధవా!
నీకిదే మా వందనం! అభివందనం.
అమరులైన ఆ కీర్తికిరీ?
సిపాయీ యోధులకివే....మా...
జోహార్! జోహార్!!జోహార్!!!

-అవుసలి ఆంజనేయులు
వెల్చాల్

కాశ్మీర్

కదిలింది కదిలింది
కాశ్మీరమే కదిలింది
కాశ్మీరమె సుందరమని
కలలు గన్న నీ దేశం
కార్గిల్లే రణ భూమిగా
కదనమందు నిలిచెరా
నీ జాతికి నిప్పు పెట్టి
నీ సంస్కృతి మట్టి గొట్టె
నీచుల దునుమాడరా
నీ జాతిని కాపాడరా
నీ ద్వేషమొ నా దోషమొ
విద్వేషం ఎవరిదైన
విదేశీయ మతోన్మాది
మన దేశమే చేరెరా
మరఫిరంగులెక్కు బెట్టి
మతోన్మాదులను దుంచగ
అలనాటి హిందు పౌజ్
అండ నీకుందిరా-వంశరాజ్
తాండూర్

పుస్తక సమీక్ష

నేతన్నల వెతలకు అద్దం పట్టిన వెల్దండి!

"మగ్గాన్ని అటకెక్కించి
మర యంత్రాల కాబూసులో
చిక్కుకుపోయిన నేతన్న
అస్థి పంజరమై తేలి
శ్వాస కోసం తండ్లాడుతు
న్నాడంటూ" నేతన్నల వెతలకు అద్దం పడుతూ కవి డా॥ వెల్దండి శ్రీధర్ **"ఆసు"** కవితా సంపుటిని వెలువరించారు. ఆర్తి, ఆర్ద్రతతో కూడిన కవితా పంక్తులతో.. పాఠకులను కదిలించే విధంగా కవి శ్రీధర్ నేతన్నల గుండె చప్పుళ్లను అక్షరాల్లో నిక్షిప్తం చేశారు. వృత్తిరీత్యా డిగ్రీ కళాశాల అధ్యాపకు లు గా పని చేస్తున్న శ్రీధర్ రచనా వ్యాసం గాన్ని ప్రవృత్తిగా మలుచుకున్నారు.

ప్రపంచకరణ నేపథ్యంలో పల్లెల్లో కుల వృత్తులనే జీవనాధారంగా చేసుకుని బ్రతికే క్రమంలో.. వారి జీవి తాలు ఎలా చిల్లం కల్లం అవుతున్నాయో శ్రీధర్ చక్కగా ఆవిష్కరించారు.

"ఊచనుండి దారాన్ని పీల్చుడ మంటే/ దేహం నుండి ప్రాణవా యువును త్యాగం చేయడమే/ నాగలి లేనిదే పంటను తీయలేనట్లు/ "ఆసు" లేనిదే బట్టలు నేయలేం.." అంటూ వస్త్రం రూపకల్పనలో "ఆసు" యొక్క పాత్రను ప్రాధాన్యతను, ఆవశ్యకతను "ఆసు కవితలో కవి అక్షరబద్ధం చేశారు.

చీర నేర్చిన ఊసులన్నీ/ నునుగా రంగా "ఆసు" నేర్పినవే/ నైపుణ్య మంతా/ ఆసుపోయడంలోనే ఉందని తేల్చి చెప్పారు. **సూర్యుని చుట్టు భూమి తిరిగినట్లు/ పోగులన్నీ "ఆసు" చుట్టే తిరుగుతుంటాయనీ/ కళ్లతో పాటు../ చేతులు కూడా/ ఆసు చు ట్టూ ప్రదక్షణం** చేసే సన్నివేశాలను/ కవి శ్రీధర్ కవితాత్మకంగా దృశ్యమానం చేశారు. **ఏ వస్త్రమైనా/ అవ్వ మునివేల్లతో పురుడు పోసుకుంటుందనీ/ ఒక్క పోగు తప్పినా/ మగ్గం మూగనోము పడుతుందని చెప్పడం బాగుంది. అయితే/ మర యంత్రాలు వచ్చేశాక/ "ఆసు" కనుమరుగైందనీ/ ఇప్పుడు "ఆసు" మౌనంగా/ ఆత్రువులను కారుస్తోందని** వాపోయారు.



ప్రతులకు:
శ్రీమతి వెల్దండి సురేఖ
ఫ్లాట్ నెం.302, సాయి శ్రీనివాసం అపార్ట్‌మెంట్
రీట్రీట్ కాలనీ,
ఫాదర్ బాలయ్యనగర్,
ఓల్డ్ అల్వాల్, హైదరాబాద్
సెల్: 98669 77741

"నేత ఇల్లు" కవితలో నేతన్నల జీవిత చిత్రణ చేయడంలో కవి శ్రీధర్ సఫలీకృతులైనారు. మగ్గం చప్పుడుతో పోటీ పడుతూ ఇంటి మూల మూలలో వినిపించే ఆకలి సవ్వడులను అక్షరాల్లో నిక్షిప్తం చేశారు.

బాపు, అవ్వ, అక్క, అన్న, చెల్లె, నేను అంటూ కవి శ్రీధర్ తమ నేతన్న కుటుంబ నేపథ్యాన్ని కులవృత్తిపరంగా వివరించిన తీరు బాగుంది. ప్రతి పంక్తీ ఈ కవితలో కవితామయంగా ఒదిగిపోయింది. భావాలు మరింత బలంగా కొలువుదీరాయి. స్వీయ అనుభ వాలను ఆవిష్కరించినప్పటికీ.. సాటి నేతన్నల కుటుంబాల శ్రమైక సౌందర్యాన్ని సైతం పాఠకులను ఆకట్టుకునే విధంగా కవి "నేత ఇల్లు" కవితకు జీవం పోశారు.

మగ్గం మీద/ ఇంద్ర ధనుస్సుల్ని దించుతూ బాపు/ పడుగు పేకలకు/ ఊపిరులూదుతూ అవ్వ/ నాడెకు గుండెలాంటి/ కండెల్ని చుడుతూ అక్క/ పెద్దనేలుకు చూపుడు వేలుకు బూడిద అద్దుకుని/ సరాల్లాంటి పోగులను/ అచ్చుకు అతుకుతూ అన్న/ ఊశెలు ఏరుతూ చెల్లె/ "పైడకోల" వేస్తూ నేను ఇంటిల్లి పాది/ నేతపనిలో కార్మికులమే అంటూ కవితను కుల వృత్తిపట్ల స్వాభిమానాన్ని చాటుకున్నారు. **ఇంటనిండా వినిపించే/ శ్రమ జీవన సంగీతాన్ని/ అక్షరాల్లో ఆవిష్కృతం చేశారు./ పన్నెండు రెక్కల చెమటను/ గంజితో కలిపి తాగి/ పురుడు పోసుకున్న చీర** అంటూ కొనసాగించారు. **తనువు మీద పేదరికానికి వేసిన మాసికల్ని చూసి జాలిగా నవ్వుతూ/ ఏ దొరసాని ఒంటి మీదికో చేరి/ వయ్యారాలు పోతుం దని చెప్పడం బాగుంది. ఇంకా ఈ కవిలో.. కడుపులో మడత కుదుముల/ ఎడతెగని చప్పుళ్లను** వినిపించారు.

ఆకలి జెండా ఒకటి/ దుఃఖానికి తడిసి/ ఇంటి మీద రెపరెపలాడు తుందని మంచి ముగింపునిచ్చారు. **"ఏమి మిగిల్చిపోయిండు"** కవిత లోనూ కవి శ్రీధర్ ఆర్ద్రమైన భావాలకు చోటు కల్పించారు. వృత్తిపరంగా నాయినతో పెనవేసుకుని ఉన్న జ్ఞాపకాలను ఈ కవితలో నెమరువేసు కున్నారు. ప్రతి నేతన్న కూడా తమ నాయిన జ్ఞాపకాలను నేడు గుర్తుకు చేసుకునే విధంగా ఈ కవితకు రూపమిచ్చారు.

"కొనూపిరి దాకా/ కొట్లాడుమని/ ఆత్మ విశ్వాసపు ఆయుధాల్ని/ అస్తి పాస్తులుగా మిగిల్చిపోయా"దంటూ చక్కని ముగింపునిచ్చారు.

రెండు చేతులకు/ పనితనం నేర్పిపో యిండు/ తలపాగలా బతుకు మని/ బతుకు పిల్లబాటల్ని పరిచయం చేసి పోయిండని కొనియాడారు.

ముడినూలులాంటి జీవితాన్ని పట్టుబ ట్టలా/ మార్చదమెలాగో చెప్పిపోయిండని/ మెచ్చుకున్నారు. మిద్దేలు తోటలు కాదు/ పోగు మర్మం నేర్పిండని/ సీతాకోక చిలుకలను/ వయ్యారి కోకల మీద/ జీవం పోయడ మెలాగో/ ధోవతి అంచులకు/ ఖాన్ దాన్‌ను/ అద్దడమెలాగో చూసి/ పోయిండని నాయినను ఉన్నతంగా చిత్రించారు. "నాయిన" పేరుతో రాసిన కవితలోనూ "నాయిన ఔన్నత్యాన్ని చాటిచెప్పారు.

"నూలే కిరీటం" కవితలో నేతన్నలు అందించే నూలువస్త్రాల గొప్పదనాన్ని, **'తలపాగ'** ప్రాశస్త్యాన్ని **"నూలు కిరీటం"** హుందాతనాన్ని దొరలకు సైతం ఎదురుపడి నిలబడిన కానూన్ తప్పనియ్యని, నిఖార్సయిన బిరుసుతనాన్ని చక్కగా కవిత్వీకరించారు.

భారతదేశపు తలకు/ పాగను చుట్టినట్టు/ అతని శిరస్సు ఎప్పుడూ/ వెండిలాంటి కిరీటాన్ని ధరించి ఉంటుందని రైతన్నకు తదితరులకు అండగా ఉండే అంశాలను కవి వెల్దండి ప్రస్తావించారు.

నేలతోపాటు తనూ/ తడవాలని వానను తలెత్తి పిలుస్తుందనీ/ పొలంలో దిగినప్పుడు/ ఒడ్డుమీద సింహాసనంలా కూర్చుంటుందని కొనసాగించిన తీరు బాగుంది.

నిద్రపోతున్నప్పుడు కలలదిండు/ ముఖం కడుకున్నప్పుడు చేతిరూమాలు/ ప్రయాణంలో తెల్లని గొడుగు/ ఆత్మగౌరవానికి ఏడుమూ రల నిదర్శనం అంటూ 'తలపాగ' గొప్పద నాన్ని గొప్పగా చెప్పారు. మర్యాదకుపోతే తలకోసి పీటవేస్తుందని అమర్యాదకు పోతే షరతుకు నిలబడుతుందంటూ 'నూలుకిరీటం' గురించి విశ్లేషించారు. ఈ గ్రంథంలో నేత న్నల వెతలతో పాటు అనేక సామాజికాం శాలపై కవితల్ని రాసి కవి శ్రీధర్ మెప్పించారు.

"రైతు బజార్" కవితలో కవి ప్రకటించిన భావాలు రైతన్నల కష్టాలను మోసు కొచ్చాయి. రైతు బజార్లలో రైతులు పడే అవస్థలను అక్షరబద్ధం చేశారు. **మట్టి ఇంద్ర ధనుస్సును తొడుక్కుని/ గిట్టుబాటు కానిధరై పూస్తుంటుంది అంటూ** కవితను ప్రారంభిం చిన తీరు బాగుంది. కనిపించని దళారి ఎవడో/ బజారంతా సంచరిస్తుం టాడు/ వెన్నెముకను గుంజుకొని/ తునువును తక్కెడకు వేలాడదీస్తాడని కవితాత్మకంగా తెలియ జెప్పారు.

గది చుట్టుకొలత చెప్తాను కానీ/ మదిని కొలవడానికి కొలమానం ఏది? అంటూ ప్రశ్నిస్తూ "నా గది" కవితను రాశారు. నా మది గది శూన్యానికి ప్రతిరూపమేననీ.. గదిదాటి బయటికి వస్తానా.. నాలోకి నేనే నిష్క్రమిస్తానంటూ ముగించారు. **"జ్ఞాపకం ఊపిరైనప్పుడు"** కవితను రమణీయ భావా లతో తీర్చిదిద్దారు. ఓ అజ్ఞాత ప్రియురాలిని ఉద్దేశించి రాసిన ఈ కవిత ఆద్యంతం చక్కని భావుకతతో కొలువు దీరింది.

సఖీ! నీవు లేని జీవితం నీటి చెలిమెలేని వాగు అనీ/ పత్రహరితం లేని చెట్టు అనీ/ చుక్కలు రాని ఆకాశమనీ/ సెగలేని నిప్పు అనీ/ ప్రాణవాయువు లేని ఊపిరితిత్తి అని ప్రేమను బలంగా ప్రకటించారు. నా మనోసంద్రంపై కదలాడే అలవు అంటూ అందమైన ముగింపునిచ్చారు. **"ఓ విరహగీతం"** కవితలోనూ కవి ప్రకటించిన భావాలు ప్రశంసనీయంగా ఉన్నాయి.

నీ మౌనం
నా చితా భస్మాన్నే కోరుతుంది
కావచ్చు
చివరికి నీకైనా నాకైనా మిగిలేది ఎడురు చూపే కదా! అంటూ విరహగీతా న్ని చక్కగా ముగించారు.

పీడితుని రెక్కలు విరిచేది
అణచివేతకు దారులు వేసేది చట్ట మెట్లా అవుతుంది? అంటూ ప్రశ్నిస్తూ మరో కవితను ఇందులో పొందుపరిచారు. ఆయుధమెప్పుడు బలహీనునికి మూడవ భుజమవ్వా లని.. ఆధిపత్యం వెన్నులో వణుకుపు ట్టించాలంటూ కవి తమ అభ్యుదయ భావాలను అక్షరాల్లో నిక్షిప్తం చేశారు.

అందరినీ ఆకట్టుకునే విధంగా **"ఆమె చేతులు"** కవిత ఉంది.

ఆమె చేతుల్లేని ఊరు
రెక్కలు తెగిన దేహమవుతుందని
సేవ మాత్రమే తెలిసిన ఆమె చేతులకు
సూర్యచంద్రులకు గాజుల్లా అమరిపోతారు అంటూ చాటారు. కవితమ కవితా పటిమను ఆమె చేతుల్లేని లోకం మొక్కలు లేని భూమి అనీ.. మానవ జాతికి అమూల్యవరం ఆమె చేతులు.. ఆమె చేతులు యిప్పుడు వివక్షను ప్రశ్నిస్తున్నాయని చెప్పడం బాగుంది. **ఆమె చేతులే పిడికిలి బిగిస్తే పురుషజాతి మనుగడ??** అంటూ ముగించారు.

బాల్య స్మృతులను గుర్తు చేసుకుంటూ **"రొట్టె"** కవితను రాశారు. చిన్నప్పుడు అక్కతో కలిసి రొట్టె పొందిన అనుభూతులకు అక్షరాకృతి నిచ్చారు. రొట్టె మట్టిపాటకు ఆది పల్లవి.. నా అక్షరాలకు ఒక అను పల్లవి అనడం కవి యొక్క కవితా ప్రతిభను సూచిస్తోంది.

అకాల మరణం చెందిన కవి, కథకుడు చైతన్య ప్రకాశ్‌కు అక్షరాంజలి ఘటిస్తూ "కవిత్వానికి మరణం లేదు" కవితను రూపుదిద్దారు.

"పేగుబంధాలు తెగుతున్న చప్పుడు" కవితలో తమ ఊరుతో ఉన్న బంధాన్ని, అనుబంధాన్ని ఆవిష్కరించారు. తమ ఊరులోని ఆకలి పోరాటాలను– బతుకు పాఠాల ఎరుపు పుటలను, ఆర్తంగా వివరించారు.

కోటానుకోట్ల జీవితాలన్నీ
మట్టి పాడే పాటకు నిశ్శబ్దరాగాలేనంటూ 'మట్టిపాట' కవితను రాశారు. మట్టిదేపుడూ తెరవెనుక పాత్రే అయినా.. జీవన 'సూత్రా'లన్నీ దాని చేతిలోనేనని తేల్చి చెప్పారు.

"మగతనాల్ని కోసేయాలి" కవితను చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు, అకృత్యాలపై స్పందిస్తూ కవి తమ భావోద్వేగాన్ని ప్రకటించారు.

పదబంధ ప్రయోగంలో సంయమనాన్ని కోల్పోయారు. భావ ప్రకటనలో ఔచిత్యాన్ని పాటిస్తూ పద ప్రయోగం చేస్తే బాగుండేది.

"నవ్విన నాగలి" కవితను **మెతుకు కావ్యానికి.. వాన చినుకులు ముందు మాట రాస్తున్నాయి"** అంటూ ప్రారంభించడం బాగుంది. అమ్మచుట్టూ అల్లుకునే అనురా గపు రెమ్మలు పిల్లలు అంటూ "పిల్లలు" కవితను, చినుకుల గొడుగు పట్టుకుని ఊరంతా సంబరపు కాలువలై పారుతుంటారంటూ **"బడి పిల్లలు"** కవితను రాశారు. పై రెండు కవితల్లో పిల్లల్ని చక్కగా ఆవిష్కరించారు.

"కవిత్వమొక కరవాలం" అని భావించే కవి శ్రీధర్ కవిత్వం యొక్క గొప్పదనాన్ని చాటుతూ.. అధికారం విర్రవీగినప్పుడు.. కవిత్వం కరవాలమై నరుకుతుందని.. భాషకు అందని ప్రేమను అనుభూతికి అందని అను భవాన్ని.. ఊహకందని ఉన్నతిని కాంక్షించి.. కవిత్వమొక కాంతి పుంజమై నిలుస్తుంది.

నిజమే కదా ఆ దిశలో కవి శ్రీధర్ చేస్తున్న కృషి.. వేస్తున్న ప్రతి అడుగు అభినం దనీయంగా ఉండనడానికి ఈ కవితా సంపుటిలోని కవితలే నిదర్శ నమని చెప్పవచ్చు. ఆయన కవిత్వంలో ముక్కుసూటితనంతో పాటు.. సున్నిత మనస్తత్వాన్ని చూస్తాం.. తాత్విక చింతనతో పాటు.. సమాజ హితాన్ని కాంక్షించే ఉత్తమ వ్యక్తిత్వా న్ని చూస్తాం. మసక బారుతున్న మానవ సంబంధాలకు మెరుగులు అద్దాలన్న ఆకాంక్ష కనబడు తుంది. ఆర్తి, ఆర్ద్రత కూడిన భావాల ప్రకటనలో అగ్రభాగాన నిలిచే ఆయన కవిత్వం పాఠకులను ఆకట్టుకుం టుంది. హృదయాలను మీ టుతుంది. ముస్మం దు మరిం త గాఢమైన కవిత్వంలో మన ముందుకు వస్తారని ఆశిద్దాం..

– దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

ఆలోచించు

భూమి నీది కాదు
నీరు నీది కాదు
గాలి నీది కాదు
చెట్లు నీవి కావు
జంతువులు నీవి కావు
పక్షులు నీవి కావు
జలచరాలు నీవి కావు
కొండలు నీవి కావు
కోనలు నీవి కావు
సృష్టికర్త నీవు కావు
ఎవరో సృష్టిస్తే
అనుభవిస్తున్నావు
అన్నీ నీకు ఉచితమే
దురాశతో ఆక్రమించి
అమ్ముకుంటున్నావు
ఆస్తులు కూడబెడ్తున్నావు
నా ఇల్లు అంటున్నావు
నా పొలం అంటున్నావు
నా స్థలం అంటున్నావు
నా కోట అంటున్నావు
నా వాడ అంటున్నావు
నాదేశం అంటున్నావు
యుద్ధాలు చేస్తున్నావు
చివరికి చస్తున్నావు
మట్టిలో మట్టిగా కలుస్తున్నావు
నాది నాది అనుకున్నది నీదికాదు
అది తెలుసుకుంటే చాలు
నీ బాధ్యలన్ని మ్ముటుమాయం

–ఎస్.ఎమ్.షరీఫ్–9618045319

కుటుంబ కోవెల

మనసులు కొలువైన కోవెల
ప్రేమలు అల్లిన అనుబంధాలు
అమ్మ నిర్మించుకున్న పొదరిళ్లు
నాన్న దర్పకత్వ దేవాలయం !.
ఆకలిని మదిలో దాచుకొని..
అన్నాన్ని పంచే అయ్యవ్వలు
ఒక్కరికి చిన్న గాయమైతే..
కుటుంబమంతా విలవిల్లాడు !.
మర్యాదలకు అదో చిరునామా
కళ్లాపు వాకిళ్ల సుగంధాల నేల
పచ్చదనవు ద్వార్జ తోరణాలు
ముగ్గుల నవ్వుల ఆహ్వానాలు !.
శోధించిన కనిపించని విభేదాలు
ఆప్యాయ అయస్కాంత ఆకర్షణలు
అపార్థాల పొరల్లేని సొంతిండ్లు
ఆనందాలు విరబూసిన హరివిల్లు !

–మధుపాళీ–9949700037

కాఫీ శతకం

–హెచ్.ఆర్. చంద్రం
సెల్: 9493248053

వెలయింతు కంద శతకము
సలలితముగ నీదు పేర సహృదయ పఠితల్
అలరగ, మన యిరువుర మె
ప్పుల జడిలో ముంచివేయ పూర్తిగ కాఫీ!

వెనుకాడబోను నీపై
వినిపించగ శతక మేను, విస్తృతమౌ నీ
ఘన చరిత ప్రశంసార్హము!
నను నీ వుత్సాహపరచి నడుపుము కాఫీ!

పదగురకు నైన దానవు,
పదుగురకును నచ్చి, మెప్పువడసిన నిను నే
పదిలముగ శతకమందున
కుదించి, వర్ణించి మెప్పుగొందును కాఫీ!

నేనును నీ అభిమానిని,
కాననె నీ పేరున శతకము రచియింపన్
బూనితి, నవ భావమ్ముల
రానిమ్మా పాఠకాళి రంజిల కాఫీ!

పలికెడిది నీదు శతకము,
పలికించెడి శక్తి వీవె, పఠితలు మెచ్చన్,
పలుకుల తల్లికి తగు నగ
వలె రాణించంగ నేను పలికెద కాఫీ!

సేవించి నిన్ను ముందుగ,
భావావేశమ్ము పొంది, ప్రారంభింతున్
నా వీరవిహారమునకు
నీవే చుక్కాని వనుట నిక్కము కాఫీ!

పొగ లెగయుచున్న నీలో
భగవద్రూపమ్మె నేను భావించెద, ని
మ్మగ నీవు సహకరించిన
ముగింతు నీ శతకరచన ముదముగ కాఫీ!

ఆవిర్భవించి యుంటివి
నీవు శతాబ్దాల క్రితమె! నిను గూరిచి ప్ర
స్తావింతు సంగ్రహమ్ముగ,
యావచ్చరితమ్ము చెప్పు టౌనా కాఫీ?

నిను తెలుగుభాషలో నే
మనవలెనో మాకు తెలియనందున 'కాఫీ'
అని పిలుచుటయే ఉత్తమ
మని తలచితి, మదియె రూఢమైనది కాఫీ!

తెలుగున 'కాఫీహోటలు'
పలుకుట యేలాగొ ఇంతవర కొకరైనన్
తెలుపరు; కాఫీహోటలె
నిలిచెను వాడకమునందు నేటికి కాఫీ!

గతమున నొక కవి నీపై
శతకము వెలయించినారు, చదివితి నే నా
కృతి, నిప్పుడు నాదౌ ప
ద్ధతి నీ శతకమ్ము వ్రాయదలచితి కాఫీ!

ఎవరి సమర్థత వారిది,
కవనములో తరతమాలు కననౌ, పఠితల్
చవిచూడగలరు పలువురి
కవితల వైవిధ్య రుచులు కమ్మగ కాఫీ!

ఒక 'వస్తువు'పై పెక్కురు
ప్రకటించుట తప్పుకాదు బహువిధ రచనల్
ప్రకటిత రచనలలో త
ప్పక వైవిధ్యమ్ము కానవచ్చును కాఫీ!

జనులకు పట్టని వస్తువు
లను గూర్చి శ్రమించి కవులు వ్రాసిన కవితల్
మనజాలవు చిరకాలము;
నిను గూర్చిన శతక మిద్ది నిలుచులె కాఫీ!

పొగడె 'గిరీశం' పంతులు
పొగచుట్టను నాడు, నేడు పొగడెద నిను నే,
పొగ లెగయు నిన్ను గ్రోలిన
ఖగవాహనునకును తృప్తిగల్గును కాఫీ!

ఉదయము పాచి మొగమ్మున
పెదవుల కీ వందవలయు విధిగా, లేదో,
వదలదట నిదుర మ! త్తి
య్యది సత్యమ్మనుచు కొంద రందురు కాఫీ!

నిను 'కలియుగామృత' మ్మని
ఘనముగ కొనియాడువారు గల రెందరొ! వా
రిని తప్పుపట్ట జాలము;
అనుపమ మగు నీ ప్రభావ మట్టిది కాఫీ!

చిక్కని పాలు, డికాషను,
చక్కెర సమపాళ్లలోన సమకూరిన, నీ
కక్కజమగు రుచి యబ్బును;
దక్కుదు పరు వమృతమునకు ధరలో కాఫీ!

నిను పరిమితముగ సేవిం
చిన ఆరోగ్యమున కీవు చేసెదవట మే,
లనుభవధను లందురు; కా
దన నేలా వారి మాట నడ్డుచు కాఫీ?

ప్రతివిషయమందు కొందరు
అతిగా వర్తించుచుందు, అటులే నిన్నున్
మితిమీరి తాగుచుందురు!
అతి యెదుననైన వర్జ్యమౌగద కాఫీ!

ఉత్తేజపరతు వట నన
లెత్తగ కొంగొత్త తలపు లెదలోతులలోన్!
మెత్తురుగద నిను రచనా
యత్తులు సేవించి నిన్ను ననయము కాఫీ!

అలవాటుపడిన నిన్ను వ
దల గలరా జనులు? వేళతప్పిన చాలున్
విలవిల లాడెద, రొక్కెడ
నిలువరు స్థిరముగను ఒక్క నిమిషము కాఫీ!

నిను పీల్చి, చప్పరించిన (సిప్)
అనుభవమున కందు అచ్చమౌ నీ రుచి; కా
దని, గుటగుట మింగిన, ఆ
అనుభూతికి వారు దూరమౌదురు కాఫీ!
నాసిక గ్రహించు నీదు సు
వాసన నీ వున్నయెడల పరిసరముల; నీ
కోసము తహతహలాడుదు
రాసవప్రియు లట్లు కొంద రయ్య (మ్మ)లు కాఫీ!

పొగ లెగజిమ్ముచు నెదురుగ
నగుపించితివేని, ఇంక నాగుట తరమా?
ఎగబడకుందురె నీ దా
స గణము ని న్నందుకొనగ సరగున కాఫీ?

సమయము చాలని వారికి,
శ్రమించలేనట్టి వారలకు 'ఫిల్టరు' ని
త్యము కుదురదు, 'ఇన్ స్టాంట్' సూ
క్ష్మములో మోక్షమ్ము చూపగల్గును కాఫీ!

ఆరారగ నిను తాగెడి
వా రొకపరి కాచి, పోసి 'ఫ్లాస్కు'న నిడ, చ
ల్లారక యుందువు, తొలగును
వారికి సారెకును కాచు పని యిక కాఫీ!

తద్దయు చెడు నారోగ్యము,
వద్దని పిల్లలను సతము వారించెడి ఆ
పెద్దలు నిను మానరు కద!
పెద్దల మన్నింతు రెట్లు పిల్లలు కాఫీ?

నిను జేయుట నొక 'కళ'గా
కొనియాడగ వలయుగాదె! కొందరు నిను జే
సిన అమృతము దలపింతువు!
తనువు, మనసు తృప్తిజెందు దానను కాఫీ!

కేవలము కషాయముగా
నీవుందువు కొంతమంది నిను గలపినచో!
సేవించిన వారెవరికి
నేవిధమగు తృప్తినీయ వీవిక కాఫీ!

నిను రుచిగ సుచిగ నందిం
చినచో నా హోట లిక ప్రసిద్ధిని గాంచున్
నిను గ్రోలగ నీ ప్రేమికు
లనుదిన మరుదెంచుచుందు రచటికి కాఫీ!

కలితీలకు నిష్ణాతులు
కల రెందరొ, నీదు పొడిని కలితీ లుండున్!
కలితీ దినుసులు వాడిన
కలుగు ననర్థాలు! కానగావలె కాఫీ!

పాలును చక్కెర కొనగా
జాలని నిరుపేద నీ కషాయము (డికాషన్)తో సం
భాలించుకొనును తా నిను
గ్రోలుచు నున్నట్లు తలచుకొనుచును కాఫీ!

నిను తాగుట నాగరికత
యని తలచిన కాల ముండె.; నటుపై ప్రతివా
రును నిను రుచిమరగిరి కద!
అనుకరణము చాల సులభమౌ మరి కాఫీ!

అలవరచుకొనుట సులభమె,
అలవాటును మానుకొనుట అతి కష్టము; నీ
వలన నిది తేటపడె మా;
కలవా టవసరమె మంచి దగుచో కాఫీ!

నిను మరగుట సరికా దని
గొణుగుట వినవచ్చు, మానుకొను వారేరీ?
గుణవంతు డెవడొ విను నిది,
నిను మానుట జరుగ దిదియె నిక్కము కాఫీ!

గౌరవమున కొక చిహ్నము
గా రాణించెదవు నీవు, కాలానుగతిన్
మారును విలువలు, సంఘా
చారమ్ములు మారుటయును సహజమె కాఫీ!

అతిథి చనుదెంచ నింటికి
ప్రతముగ నిన్నిచ్చితీరవలె, కాకుంటే,
అతిథి నవమానపరచిన
స్థితి యగు, గృహమేథి యేమి చేసిన కాఫీ!

ఇది మంచో చెడొ తెలియదు,
పదుగురు పాటించుచున్న పద్ధతి యగుటన్
ఇది వర్తమాన ధర్మము;
విదితముగా నీ ప్రశస్తి పెరిగెను కాఫీ!

పోటీ నీతోడను తే
నీటికి గలదనెడు మాట నిక్కమె గానీ,
పోటీ వరకే, అది నీ
సాటి యగుట యెన్నటికిని జరుగదు కాఫీ!

చక్కెరవ్యాధి గ్రస్తులు
చక్కెర లేకుండ జేసి చప్పగనైనన్
గుక్కెడు తాగి తరింతురు!
ఒక్క దినము నిన్ను మాని యుండరు కాఫీ!

పడవలె ప్రతి ఉదయమ్మున
కడుపున నీ, వపుడె లోన కదలిక మొదలై,
వడి సుఖవిరేచనమ్మై
పడయుదు రెంతేని తృప్తి వారలు కాఫీ!

శాపోపహతులు కొందరు
పాపము, నిను తాగలేరు బలముగ మదిలో
నీపై కోరిక యున్నను,
రూపాయలు లేక చేతిలోనను కాఫీ!

బడలికగా నున్నప్పుడు
పడుచో ఒక కప్పు నీవు, పరుగిడకున్నే
బడలిక గిడలిక తృటిలో!
కడు చిత్రము నీదు మహిమ! కాదే కాఫీ?

కావచ్చును నగరమ్మది,
కావచ్చును పట్టణమ్ము, గ్రామమె యైనన్
కావచ్చు, నెందునైనను
నీ వందున నుందు వనుట నిక్కము కాఫీ!

ఇందు గల, వందు లేవను
సందేహము లేదు మాకు, సార్వత్రికమై
అందరికి నందుబాటుగ
నెందైనను నుందువమ్మ యెపుడును కాఫీ!

మా పల్లెటూరినందున
నీ పేరున హోటలొకటి నెలకొనె నెపుడో
మా పిన్ననాట! నెల్లెడ
చూపట్టును నీదు ప్రగతి, చోద్యము కాఫీ!

మాయింట చద్దియన్నమె
హాయిగ చిననాట తినుట అలవాటగుటన్
నీ యూ సపు డే మెరుగము;
పాయని అనుబంధ మిపుడు ప్రబలెను కాఫీ!

చావుకు నికటస్థుండగు
జీవికి నీపేరు చెప్ప చెవిలో మెల్లన్
జీవి పెదవుల గదల్చును!
నీవె పిలిసట్లు తలచునేమో కాఫీ!

పోయుదురు తులసి తీర్థము
ఆయువు తీరెడి సమయమునందున, గానీ
పోయవలె నిన్ను, జీవుడు
హాయిగ కనుమూయు తృప్తుడై మరి కాఫీ!

కొందరికి 'స్ట్రాంగు' కావలె,
కొందరు 'లైటు'గనె తీసుకొందురు, మరియున్
కొందరు 'మీడియ' మందురు,
కొంద రెటులనున్న పు(మె)చ్చుకొందురు కాఫీ!

టీపార్టీ యందురు, కా
ఫీపార్టీ యేల ననరొ? విజ్ఞులు దయతో
ఈ పొడుపు కతకు విడుపును
చూపెట్టిన చాలు మనకు సూటిగ కాఫీ!

నిను చేకొని వ్యాపారము
చినచిన్నగ మొదలుపెట్టి, స్థితిపరులుగ వృ
ద్ధినిగన్న వార లెందరొ
కనవత్తురు లోకమందు! కాదే కాఫీ?

నిను నమ్మి యెందరో జీ
వన యానము చేయుచుంట ప్రత్యక్షముగా
గనవచ్చు వివిధ రీతుల
ననుక్షణము ననుదినమ్ము నటనట కాఫీ!

నిను పండించెడు రైతులు,
నిను వ్యాపారమ్ముజేయ నేర్చిన వణిజుల్,
నిను తాగుట మాత్రమె నే
ర్చిన మముబోంట్లెపుడు నిను స్మరింతురు కాఫీ!

నిను జేయుట నేర్వని భా
ర్యను భర్త క్షమించజాల, డా విధముగనే
నిను గలుపుట కుదురని భ
ర్తను భార్యయు దెప్పిపొడుచు తప్పక కాఫీ!

నిత్యావసరపు దినుసువు,
అత్యవసర మైన దాన వగుటను గాదే
ప్రత్యేకశ్రద్ధతో ని
న్నత్యాసక్తిగను నేర్తు రందరు కాఫీ!

పండుగ వంటలు నేర్వక
యుండిన సరిపెట్టుకొనుట యుండును గానీ,
పెండిలి నాటికి కన్నెలు
ఖండితముగ నిన్ను నేర్వగావలె కాఫీ!

బొడ్డూడని పసివాళ్లును
విడ్డూరము నిన్ను ద్రావ వేగిరపడు! టా
'బుడ్డోళ్ల' నడ్డుకొను టొక
గడ్డు సమస్యేను, నిత్యగండము కాఫీ!

నిను తాగని వారెవ్వరు?
కనిపింతురు చాల అరుదుగా నవ్వారల్!
నిను గోరువారె బహు సం
ఖ్యను గనవచ్చెదరు చూడగా మరి కాఫీ!

జ్వరపీడుతుడౌ రోగియు
తరచుగ నిను 'సిప్పు'చేయ తహతహ లాడున్
జ్వరపడిన నోటికిని రుచి
కరముగ నీవుందు, వదియె కత మో కాఫీ!

ఎన్నెన్నో పానీయము
లున్నను, నీముందు నిలుచుటుండదు, కీర్తిన్
గన్నావు నీవు హెచ్చుగ!
ని న్నెన్నిన పిదపె మరొక టెన్నుట కాఫీ!

నీ నామము కడు రమ్యము,
మానో రది పలికినంత మధురం బగు, మా
మేనెల్ల పులకరించును;
మా నోరూరును తలచిన మదిలో కాఫీ!

నీ మాహాత్మ్యము పొగడగ
సామాన్యుడనైన నాకు సాధ్యంబగునా?
పామరుడు మహాకావ్య ర
సామృతపానమ్ము సేయ నర్హుడె కాఫీ?

ఆ పూర్వ యుగములందున
నీ పుట్టుక జరిగియున్న నిక్కముగానే
నీపేర నొక పురాణము
రూపొందియె యుండు మెచ్చ లోకము కాఫీ!

అలనాడు వ్యాస వాల్మీ
కులు నిన్నొక గుక్కెడైన గ్రోలిన యెడలన్
వెలువడక యున్నె రసభర
ములు కావ్యము లెన్నొ చదివి మురియగ కాఫీ!

'కూసింత' గ్రోలుచో నిను
భాసుండును, కాళిదాసు, భవభూత్యాదుల్
మా సంస్కృత రూపక వి
న్యాసమునకు మృగ్యమౌను హద్దులు కాఫీ!

నిను శ్రీనాథుడు గ్రోలిన
వినబడదా చాటుధార వీనులవిందై?
మన తెలుగు కవులు మరిమరి
కొనియాడెద రిపుడు నిన్ను గొప్పగ కాఫీ!

నచ్చిన వస్తువు గైకొని,
మెచ్చుగ పద్యమ్ము లల్లి మేల్మేలనగా,
అచ్చెరువుగొల్పు సత్కవు
లిచ్చట బహుసంఖ్య నుండి రెప్పుడు కాఫీ!

తలచిన నోరూరింతువు,
కులదైవముగా గణించి కొలిచెడి వారున్
గల రెందరొ! నీ మహిమలు
గల వెన్నియొ! నేను జెప్పగలనా కాఫీ?

తిండి ఒక దినము లేకయు
నుండుట సాధ్యమ్మె, పూటయును కష్టమె నీ
వుండనిచో గడపుట అను
చుండరె నీ భక్తజనము లొకటై కాఫీ?

'చద్దన్నము' వెగటాయెను,
పొద్దున నిను తాగు టనిన మోజుగ నుండెన్
పెద్దలు పిన్నలు నెల్లరు
తద్దయు నిను రుచిమరగిరి తల్లీ కాఫీ!

నిను సేవింతురు పండితు
లును, పామరు లొక్క రీతి లోకమునందున్
కనబడదు వయోభేదము,
వినబడ దొక యింత లింగభేగము కాఫీ!

ఆకలిని చంపజాలెద,
వాకలి నీవలన తీరుననునది భ్రమయే!
ఆకలికి తిండి పడవలె,
ఆకలి తీర్చంగజాలు నదియే కాఫీ!

మానవ జాతి సమస్తము
బానిసయైపోయె నీకు! బైటపడంగా
నేనాడును దృఢదీక్షను
బూనిన వైనమ్ము లేకపోయెను కాఫీ

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1015వ రోజు 'పరిశుభ్రత' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'పరిశుభ్రత' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా సమర్పిస్తున్నాం.

-సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
ఏకాంశ కవిత్వం నిర్వహణ:
-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

తొలి అడుగు ఎవరిదో

పరిశుభ్రతకు కొందరు అర్థం మార్చి
పరులు శుభ్రంగా ఉండాలంటూ
తెగ లెక్చర్లిస్తారు.
వాకిట్లో అలుకు లేదు
ఇంట్లో చేరేప్పుడు
కాళ్ళు కడగడం తెలియదు
అయినా ప్రవచనాలు చెబుతూనే ఉంటారు.
పరిసరాల పరిశుభ్రత
వ్యక్తిగత శుభ్రత
మానసిక శుభ్రత
ఏదొకటి కరువైనా
దేన్ని నిర్లక్ష్యంచేసినా
పరిహారం చెల్లించాల్సిందే
పడక గదికి పరిమితమై పోవాల్సిందే.
ఇల్లంతా శుచిగా శుభ్రం చేసి
పోగేసిన చెత్తంతా
ఇంటి వెనుక పడేసి
చేతులు దులుపుకుని
పరిసరాల పరిశుభ్రతపై
అవాకు చవాకులు పేలుతూ
ఎవరినో బాధ్యులను చేసి
తను మాత్రమే శుభ్రతకు
మారుపేరనే వాళ్ళెందరో.
ఒంటిని శుచిగా
ఉంచుకుంటాననే వాడు
వాతావరణంపై
ధ్యాస ఉంచడెందుకో.
వాహనాల కాలుష్యం
రేడియేషన్ ప్రభావం
పరిశ్రమల విషవాయువులు
వ్యర్థపదార్థాలతో జలాలు
సమ్మిళితమై
జనాన్ని చంపేస్తున్నా
గుర్తురావెందుకో
కారణం అన్వేషించడెందుకో.
ఏ ఒక్కరిదో అనుకోకుండా
మొదట తాను మారాలి
తొలి అడుగు తనే వేయాలి
ముందు చూపే కాకుండా
చుట్టూ పరికించే మనసుండాలి.

-గుర్రాల వేంకటేశ్వర్లు

ఆరోగ్యదాయకాలు

ముందు ఒళ్ళు పరిశుభ్రం
ఆపై ఇల్లు పరిశుభ్రం
తర్వాత పరిసరాల పరిశుభ్రం
ఆరోగ్య జీవనానికి సోపానం.
చేసుకుంటే పరిసరాలు పరిశుభ్రం
సక్రమంగా చేస్తే వ్యర్థాల విసర్జనం
పర్యావరణం పదికాలాలు భద్రం
సాధ్యం అంటు వ్యాధుల నివారణం
బహిరంగ మానవ విసర్జనలు
బహిరంగ మురుగు పారుదలలు
పేరుకు పోతున్న ప్లాస్టిక్ పదార్థాలు
వీధుల్లో వాహనాల కాలుష్యాలు
కలవరపెడుతున్న
పారిశ్రామిక వ్యర్థాలు
పర్యావరణానికి గొడ్డలి పెట్టులు
పరిశుభ్రతకు పట్టిన గ్రహణాలు.
పంట శాలలు, ఆహార శాలలు
మరుగుదొడ్లు, ఆసుపత్రులు
పెంపుడు జంతువులు, రోగులు
పాటించక పోతే పరిశుభ్రతలు
అంటురోగాలకవి నిలయాలు
అందరి ఆరోగ్యంతో ఆడుకునే అంశాలు
పరిసరాల పరిశుభ్రతలు
ఆరోగ్యదాయకాలు.

-జె.వి.కుమార్ చేపూరి

దేవుని కొలువు

ఇల్లు వాకిలి ఒళ్ళు మనసు
శుచి శుభ్రత ఉంటేనే
దైవనిలయాలు!
బాహ్యశుద్ధితో పాటు
చిత్తశుద్ధి ఉన్న మనిషి లో
దైవం తీరును కొలువు.
మడితడి ఆచారాలు
గోశాలలు
పెరటిలో చెట్లు
వాకిట్లో వేప రావి జువ్వి
పర్యావరణ పరిరక్షణలో
పరిశుభ్రతలో
కళకళలాడిన పల్లెలు.
ఆనాటి ఋషివాటికలు
హోమాలతో శుచి శుభ్రతలతో
కళకళలాడిన శాంతినికేతాలు
మరి నేడో?.
ఆధునికత పేరుతో
ఎవరి ఇల్లు వారికి
ప్లాస్టిక్ తోరణాలు పూలతో
పైనపటారం
లోనలొటారంతో
మన ఇంటిచెత్త ప్లాస్టిక్ కవర్లో
వీధిలోకి ఫ్లైయింగ్ సాసర్!.
నాలాలో ప్లాస్టిక్ కవర్లు!
మురికినీటి తో దోమలు
ఎక్కడ పడితే అక్కడ
ఘూక్ ఘూక్ ఉమ్ములు.
స్వచ్ఛభారత్
హరితహారం నినాదాలతో
ఆచరణలో ఆరంభశూరత్వం
చెత్త బుట్టలు
గల్లీలో డస్ట్ బిన్స్
మటుమాయం.
భాష వేషం స్టైల్ లో
విదేశీ భేషజం
వారి
మంచి అలవాట్లు
పద్ధతులు
ఆచరించని మనం!?.
సెంట్ స్ప్రేలతో
గబ్బు కొట్టే జనం!
క్లీన్లీనెస్ ఈజ్
నెక్స్ట్ టూ గాడ్ లీ నెస్
చిలకపలుకులు బడిలో
బాల్యంలోనే ఇంటిశుభ్రతలో
పిల్లలకి తర్ఫీదు
బడిలో చదువుతో పాటు
క్లాస్ రూం ఆవరణ
బాలలకి శిక్షణ
క్రమశిక్షణ!
ఎవరికి వారు చేయాలి
చేయించాలి.

-ఎ.రాజ్యశ్రీ

శుభ్రము జేయుము - భద్రముగ

తే.గీ. పరిసరములను బాగుగ పట్టుబట్టి
శుభ్రమును జేయ వలెనయ్య భద్రముగను
ఆయురారోగ్య సంపదల్ యధికముగను
మనకు చేకూరుచుండును మాట
వినుము!.
తే.గీ. చెత్తవేయంగ ప్రాంతాలు చెడును
సుమ్మి
గబ్బులేచియు గడుపుట గగనమగును
వీధిశుభ్రత కాపాడ విధిగ నీవు
సుఖమునొందెద వయ్యరో శుభ్రముగను!.

- జక్కని గంగాధర్

ఆరోగ్య హేతువు

శుచి శుభ్రతకి
వెయ్యాలి పెద్దపీట
లేకపోతే
మన ఆరోగ్యం ధమాల్
పరి శుభ్రత ఉండాలి
ప్రతి చోట
అది ఇంట్లో అయినా
ఇంటి బయట కానీ
పరిసరాలే కాదు
వ్యక్తిగత శుభ్రత
ఆహార శుభ్రత కూడా ఉండాలి
శరీర శుభ్రత
మస్తిష్క శుభ్రతకూడా
పరి శుభ్రతలో భాగమే
నకరాత్మక ఆలోచనలు వదిలి
సకారాత్మక ఆలోచనలతో
సఖ్యత
మెదడు ను శుభ్రపరిచి
ఆరోగ్యం పెంచు
పరిశుభ్రత లేని ఆహారం
అంటు వ్యాధులకి ఆలవాలం
పరి శుభ్రతలేని పరిసరాలు
అనారోగ్య హేతువులు
పరిసరాలను శుభ్రంగా ఉంచుకో
అంటు వ్యాధుల్ని తరిమెసేయ్
పరి శుభ్రమైన పరిసరాలు
ఆరోగ్యానికి మూలం.

-మోటూరి శాంతకుమారి

సంప్రదాయం

ఇంటిలక్షణం
పందిరి చెబుతుందని
ఇల్లాలిని చూస్తే ఇంటిల్లిపాదిని
చూడక్కరలేదంటూ
నానుడులతో
భారతీయత ఎప్పుడో
శ్రీమంతమైంది?.
ఆచారాల మతలబులతో
సంస్కృతి సంప్రదాయాల
సదాచారంతో
పబ్బతి పట్టే మహోన్నతం
మనదేశాన.
ఆచారమంటేనే
అంతెత్తునుంటూరు
వ్యవహారమంటేనే
వల్ల కాదంటూరు
సాంప్రదాయమంటేనే
సాకులు వెదుకుతారు
ఆద్యాత్మికమంటే
అంతా మిథ్యేనంటారు.
ఎంగిలి మంగళములన్న
ఏవగింపులెందుకయ్యా
హెపటైటిస్
సశాస్త్రీయత రుజువులున్నవి కాదా.
ఎదురులేదు నాకంటూ
విర్ర వీగినందుకేమో
ఎదురైనది తిన్న ఫలితములేమో
ఎల్ల విశ్వము నేడు గొల్లుమనుచుండె
ఏకాకులను చేసి
బంధాలను విడగొట్టి బావురుమంటూ.
ఏ క్షణాన పడమటింటి
పాపపు కన్నుపడిందో
కాట కలిసిపోతున్న కంచి కథలలా
ఒకటొకటిగా కదులుతున్న
ఇటుకరాయిలా
బీటలు వారుతున్న
కోటగోడల ఆనవాళ్ళు.
ఒల్లైనా ఇల్లైనా
శుభ్రతలాచరిస్తేనే సుందరం
నీతి నిజాయితీల నిలువెత్తు చిహ్నంలా
నిలిచిన కొంతమందిలా అందరూ
అంతఃశుద్ధిని కూడా ఆచరిస్తే
మందిరం.
మన శుభ్రతలను గాలికొదిలేసి
మడతపేచీలాంటి డియోడరెంట్లను
అద్దెకు తెచ్చుకున్నంత మాత్రాన
శుభ్రతల ఉత్తీర్ణతలు పొందినట్టు కాదు.

- నగునూరి రాజన్న

సర్దడం ఓ కళ

సర్దడం ఓ కళ
సూర్యోదయం మొదలు
ఇల్లు పరిసరాలు అన్నీ
సర్దుకుంటూ
తుడుచుకుంటు
అన్నీ పరిశుభ్రంగా
ఉంచడంలో ఇంటిల్లి పాది
సరిదిద్దుతూ అందంగా అలంకరిస్తూ
ఇల్లు వాకిలి అన్ని కూడా
పరిశుభ్రత పరిరక్షణ కోసం
ప్రతి ఇల్లాలు కష్ట పడుతూ
ఇళ్ళంతా సర్ది ఉంచుతూ
ఎక్కడా దుమ్ము ధూళి లేకుండా
అందంగా ఉంచాలి అంటే
ఇంటిల్లిపాది
సరైన పద్ధతి నేర్పుతూ
ఇంటిని తీర్చిదిద్దుతారు
ఇది ఒక ప్రత్యేక కళ
గృహ అలంకరణలో
ప్రత్యేక పాత్ర వహిస్తూ
పరిసరాల పరిరక్షణలో
ప్రతి వ్యక్తి
కృషి చేస్తేనే విలువ
అది ఒక కళ
అందమైన వస్తువులు
సర్దుకొని ఉంచడమే పరిశుభ్రత

-నారుమంచి వాణీ ప్రభాకరి

పునరుత్పాదక శక్తి వనరులే భవిష్యత్తు వెలుగులు

(డా: మధు-9949700037)

ప్రపంచాన్ని నడిపే సాధనం ఇంధనం (శక్తి). శక్తిని ఉత్పత్తి చేయడం కాని, నాశనం చేయడం కాని అసాధ్యమే. శక్తిని ఒక రూపం నుంచి మరొక రూపంలోకి మాత్రమే మార్చవచ్చని సైన్స్ మౌళిక సూత్రీకరణ చేసింది. బొగ్గు దహనంలో ఉష్ణం, ఉష్ణంతో నీరు మరిగి ఆవిరి కావడం, ఆవిరితో టర్బైన్లు తిరగడం, టర్బైన్లు కదలడంతో విద్యుత్తు జననం, విద్యుత్తుతో బల్బులు వెలగడం, యంత్రాలు నడవడం మనకు తెలుసు. విద్యుచ్ఛక్తి, యాంత్రిక శక్తి, రసాయన శక్తి, ఉష్ణశక్తి, స్థితిశక్తి, గతిశక్తి లాంటి పలు రూపాల్లో ఉన్న శక్తిని ఒక రూపం నుంచి మరో రూపంలోకి సులభంగానే మార్చవచ్చు.

సాంప్రదాయ, సాంప్రదాయేతర శక్తి వనరులు:

దహన క్రియలో మండుతూ ఉష్ణశక్తిని విడుదల చేసే సంప్రదాయ శిలాజ ఇంధనాలలో వాయు (యల్పిజీ), ద్రవ (పెట్రోల్), ఘన (బొగ్గు/వంట చెరుకు) ఇంధనాలు లాంటి తరిగే ఇంధనాలతో పర్యావరణ కాలుష్యం అధికంగా నమోదు అవుతున్నది. సౌర, పవన, అలల శక్తి వనరులను సంప్రదాయేతర, తరగని, పునరుత్పాదక ఇంధనాలుగా వ్యవహరిస్తారు. తరిగే ఇంధనాల వినియోగంతో గాలి కాలుష్యం, పర్యావరణ/వాతావరణ ప్రతికూల మార్పులు, ప్రకృతి దుర్వినియోగం లాంటివి కలుగుతాయి. సంప్రదాయ ఇంధనాల వినియోగంతో వాటి లభ్యత తగ్గుతూ, కార్బన్ ఉద్గారాలు పెరుగుతాయి. తరగని సంప్రదాయేతర ఇంధనాల వినియోగంతో భూగ్రహం ఉన్నంతకాలం వాటి కొరత అసలే ఉండదు. ఇలాంటి పునరుత్పాదక ఇంధనాలు దేశాభివృద్ధిలో అత్యంత ప్రధాన భూమికను నిర్వహిస్తున్నాయి. ఇలాంటి పర్యావరణ హిత తరగని ఇంధనాలే భవిష్యత్తు ఆశారూపాలుగా నిలుస్తున్నాయి. ఇంధనాల విచ్చలవిడి వాడకాన్ని తగ్గించడం, ఇంధన పొదుపు మార్గాలను వివరించడం, ప్రజారవాణను ఆశ్రయించడం లాంటి తగు జాగ్రత్తలను సామాన్య జనానికి, విద్యార్థిలోకానికి, ఇంధన వినియోగదారులకు వివరించడానికి ప్రతి ఏట 14 డిసెంబర్‌న "జాతీయ శక్తి పరిరక్షణ దినం" పాటించుట ఆనవాయితీగా మారింది.

శక్తి తలసరి వినియోగం:

ప్రపంచ జనాభాలో 18 శాతం ఉన్న భారతంలో ప్రపంచ శక్తి వినియోగంలో 6 శాతం మాత్రమే అని తెలుస్తున్నది. దేశ ప్రగతిని శక్తి తలసరి వినియోగం ఆధారంగా నిర్ణయించే ఆధునిక డిజిటల్ యుగంలో ప్రపంచ మానవాళి ఉన్నది. పేద దేశాల్లో శక్తి తలసరి వినియోగం అతి తక్కువగా ఉండడం, ధనిక దేశాల్లో అత్యధికంగా ఉండడం సహజంగా కనిపిస్తుంది. చైనా, అమెరికా, రష్యా, ఇండియా, జపాన్, కెనడా, యూకె లాంటి దేశాలు అధిక విద్యుత్తును వినియోగిస్తున్నాయి. శక్తి తలసరి వినియోగంలో అగ్రభాగాన ఐస్‌లాండ్ (53,832 కెడబ్ల్యూహెచ్), కెనడా (15,438), అమెరికా (13,098), ఆస్ట్రేలియా (10,071), జపాన్ (8,010), చైనా (4,906 కెడబ్ల్యూహెచ్)లు నమోదైనాయి. ఇండియాలో తలసరి శక్తి వినియోగం 1208 కెడబ్ల్యూహెచ్ మాత్రమే నమోదైంది. భారత్‌లో 17 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాల శక్తి తలసరి వినియోగం జాతీయ సగటు కన్న తక్కువగా, 19 రాష్ట్రాల్లో అధికంగా నమోదు అవుతున్నాయి. అత్యధిక తలసరి వినియోగం దాద్రా, నగర్ హవేలి 15,517 కెడబ్ల్యూహెచ్‌తో తొలి స్థానంలో ఉండగా, బీహార్‌లో కనిష్ఠంగా 332 కెడబ్ల్యూహెచ్ మాత్రమే ఉన్నది. ఆంధ్రప్రదేశ్‌లో 1,319, తెలంగాణలో 1,551 కెడబ్ల్యూహెచ్ తలసరి వినియోగం గమనించబడింది. ఇండియాలో 74 శాతం శక్తిని పారిశ్రామిక, వ్యవసాయ రంగాలు మాత్రమే వినియోగిస్తుండగా, తరువాత 3వ స్థానంలో గృహ వినియోగం ఉందని తెలుస్తున్నది.

విద్యుత్తు వాహనాలే ప్రత్యామ్నాయమా?!

ప్రపంచ కార్ల మార్కెట్‌లో 5వ స్థానంలో ఉన్న ఇండియా మె?దటి మూడు స్థానాల్లో చేరడానికి ఎంతో సమయం పట్టదని, 2030 నాటికి దాదాపు 40 కోట్ల కార్లు వినియోగంలో ఉంటాయని తేలుతున్నది. కార్లు, ఇతర వాహనాల వినియోగం పెరుగుట వల్ల ఇంధన ఉపయోగం, రవాణ రద్దీ, రోడ్ల వసతుల కొరత, గాలి కాలుష్యం, నగరాల్లో కాలుష్య మబ్బులు కమ్మడం లాంటి పలు అనర్థాలు తప్పనిసరి జరుగుతున్నాయి. నడక, ప్రజా రవాణ, సైక్లింగ్, రైలు మార్గాలు, రోడ్ల విస్తరణతో పాటు 'పర్యావరణ హిత కార్లు' సత్వరమే రావలసి ఉంది. శిలాజ చమురు ఇంధన వాహనాలకు నెమ్మదిగా చరమగీతం పాడుతూ, విద్యుత్తు కార్లు ప్రవేశించాల్సి ఉంది. 2030 నాటికి కనీసం 30 శాతం విద్యుత్తు వాహనాలు రానున్నాయని, వీటి వినియోగం పెరుగుతూ, చమురు వాహనాల ఉపయోగం తగ్గినపుడు మనం ఆశించిన కాలుష్య మబ్బులు వేగంగా తొలగి పోయే మంచి రోజులు దగ్గరలోనే ఉన్నాయని తెలుస్తున్నది. 2020లో విద్యుత్తు కార్ల అమ్మకాలు 2.1 మిలియన్లకు చేరాయని, నేడు విద్యుత్తు కార్ల అమ్మకాలు 2 శాతం ఉండడం శుభ సూచకమనే చెప్పాలి. విద్యుత్తు వాహనాల వినియోగం వాటి స్టోరేజ్ బ్యాటరీల లభ్యత మీదనే ఆధారపడి ఉంటాయి. వాహన స్టోరేజి బ్యాటరీలు ఇండియాలో తయారు కాని కారణంగా విదేశాల నుంచి దిగుబడి చేసుకోవలసి వస్తున్నది. 2021లో ఇండియా 1 బిలియన్ డాలర్ల విలువైన లిథియం బ్యాటరీలను దిగుబడి చేసుకుంది. విద్యుత్తు వాహనాల వినియోగాన్ని పెంచడానికి భారత ప్రభుత్వం ఫేమ్-2 ఫథకం కింద రూ: 10,000 కోట్లు, పియల్ఐ బ్యాటరీ సెల్స్ పథకం కింద రూ: 18,100 కోట్లు, పియల్ఐ ఆటోమోటివ్ విడిభాగాల పథకానికి రూ: 25,938 కోట్లు వెచ్చిస్తున్నది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వాములు చమురు వాహనాల వాడకాన్ని తగిస్తూ, విద్యుత్తు వాహనాల వినియోగం పెంచితే పర్యావరణానికి, వాహనదారుల ఖర్చులకు కల్లెం పడుతుంది.

శక్తిని పొదుపు చేసే మార్గాలు:

నిత్యజీవితంలో శక్తి వనరులను కనిష్ఠంగా వాడడం, కార్యదక్షత అధికంగా ఉన్న వాహనాలను వినియోగించడం, విద్యుత్తు వాహనాల వాడకాన్ని పెంచడం, ప్రజారవాణ వ్యవస్థను పటిష్ట పరచడం, శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించడం, పర్యావరణహిత ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించడం, సంప్రదాయేతర శక్తి ఉత్పత్తిని పెంచడం, సియఫ్ యల్/యల్ ఈడి బల్బుల వాడకం, స్మార్ట్ పవర్ సిస్టమ్స్/ప్రోగ్రామబుల్ థర్మోస్టాట్స్ వాడడం, ఎఫిషియంట్ ఎలక్ట్రానిక్ ఉపకరణాలు వాడడం, శక్తి వృధాను అరికట్టడం, గీజర్ల వాడకాన్ని తగ్గించడం, ఉష్ణబంధక/లీక్ ప్రూవ్ నిర్మాణాలు చేపట్టడం, హెచ్‌విఏసి ఎనర్జీ స్టార్ అప్‌గ్రేడెడ్ ఉపకరణాలను వాడడం లాంటి చర్యలు/జాగ్రత్తలు మాత్రమే ఆరోగ్యకర భవిష్యత్తుకు పునాదులని భావిద్దాం. కనిష్ఠ శక్తి వినియోగంతో బిల్లుల ఖర్చు తగ్గడం, జాతీయ శక్తి కొరత సమస్య తీవ్రత తగ్గడం, ఫారిన్ ఎక్స్ఛేంజ్ సమస్యను తగ్గించడం, పర్యావరణ కాలుష్యాన్ని కట్టడి చేయడం వంటి అంశాల్లో జాగ్రత్త పడాలి. ఇంధన వాడకాన్ని తగ్గించడానికి సైక్లింగ్, ప్రజా రవాణలను వాడడం అలవాటు చేసుకోవాలి. శిలాజ ఇంధన వాహనాలకు బదులు ఎలక్ట్రానిక్ వాహనాల వినియోగం భవిష్యత్తు ఆశాకిరణంగా తోస్తున్నది. ఇంట్లో/కార్యాలయాల్లో అనవసరంగా బల్బులు, ఫ్యాన్లు, ఏసిలు (24-26 డిగ్రీలు), గీజర్లు, టివీలు, ఐరన్ బాక్సుల వాడకాన్ని ప్రతి ఒక్కరు భాద్యతగల పౌరుల వలె కట్టడి చేయాలి. కార్యాలయం, ఇంటి పైకప్పుల్లో సౌరశక్తి ఉత్పత్తి ఏర్పాట్లు తప్పనిసరి చేయాలి. సౌరశక్తితో వీధి దీపాల వాడకం ఉండేలా చూసుకోవాలి. పవన, అలల శక్తి ఉత్పత్తులను పెంచడాన్ని ప్రోత్సహించాలి. స్వంత డబ్బును మితంగా వాడినట్లు, మన గృహాల్లో విద్యుత్తును కూడా పరిమితంగా వినియోగించాలి.

సంప్రదాయ శిలాజ ఇంధనాల వినియోగంతో కార్బన్ ఉద్గారాల సమస్య ఉత్పన్నం అవుతుందని గమనించాలి. శక్తిని వ్యర్థం చేయడం నేర నమానమనే సద్భావనలు విస్తరించాలి. శక్తి వినియోగ బానిసలుగా మారుతున్న ప్రపంచ మానవాళి రాబోయే రోజుల్లో శక్తి కొరతను ఎదుర్కోవచ్చని హెచ్చరిస్తున్నారు. జాతి అపూర్వ అమూల్య సంపద శక్తి మాత్రమే అని గమనించాలి. శక్తిని మితంగా వాడే పౌరులే అసలైన దేశభక్తులని, శక్తిని ఆదా చేయడం అలవాటు చేసుకొని, రేపటి అవిచ్ఛిన్న వెలుగులకు పునాదులు వేద్దాం. శక్తిని తెలివిగా వాడుకుంటూ, చురుకైన దేశ పౌరులమని నిరూపించుకుందాం.

(14 డిసెంబర్ "జాతీయ శక్తి పరిరక్షణ దినం" సందర్భంగా)

ఫుడ్ పాయిజన్.. 20మంది విద్యార్థులకు తీవ్ర అస్వస్థత

అమరావతి, డిసెంబర్ 13:ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కోనసీమ జిల్లాలో ఫుడ్ పాయిజన్ కావడంతో 20మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. కోనసీమ జిల్లాలోని ఓ బీసీ హాస్టల్ లో ఫుడ్ పాయిజన్ అయ్యింది. దీంతో 20మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు.అమలాపురం రూరల్ మండలం సమనస బీసీ గురుకుల హాస్టల్లో ఫుడ్ పాయిజన్ అయింది. ఫుడ్ పాయిజన్ కావడంతో తీవ్ర కడుపునొప్పి, బ్లడ్ మోషన్స్‌తో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో భారతీయ భాషా ఉత్సవం

భారతీయ భాషా సంస్థ, మైసూరు మరియూ ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, వెంకటాచలం, వారి సంయుక్త ఆధ్వర్యంలో 11-12-23 సోమవారం ఉదయం నుండి సాయంత్రం వరకూ మహాకవి భారతీయార్ శతజయంతి సందర్భంగా సభను ఘనంగా నిర్వహించారు. డా.రాంబాబు ప్రార్థనతో ప్రారంభమైన సభ, తొలుత భారతీయ భాషా సంస్థ సంచాలకులు ఆచార్య శైలేంద్ర మోహన్ వర్చువల్‌గా ప్రారంభిస్తూ మహాకవి భారతీయార్ భాషా సాహిత్యాలకు చేసిన సేవలను గుర్తుచేశారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు, ఆచార్య మాడభూషి సంపత్‌కుమార్ సభకు అధ్యక్షత వహించి తమ విశేష ప్రసంగంలో సుబ్రహ్మణ్యభారతి చేసిన సేవలను కొనియాడారు. అనంతరం హైదరాబాదు నుండి విచ్చేసిన తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కె.యాదగిరి భారతీయ భాషల్లో ఏకత్వంపై ప్రసంగించారు. తిరుపతి ఐ.ఐ.టి నుంచి విచ్చేసిన అడ్లూరి రఘురామరాజు భారతీయ భాషల్లో సాంకేతిక విద్య ప్రాధాన్యత గురించి వివరించారు. తిరుపతి శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆచార్యులు పేట శ్రీనివాసులు వర్తమాన పరిస్థితుల్లో భారతీయ సాహిత్యం అనే అంశంపై ప్రసంగించారు.

భోజన విరామానంతరం జరిగిన బహుభాషా కవి సమ్మేళనంలో నెల్లూరు వాసియైన ఆంగ్లకవి మైదవోలు వెంకటశేష సత్యనారాయణ రచించిన "రైం-రిథం-ఇమేజరీ" అన్న ఆంగ్ల కవితా సంపుటిని ఆచార్య కె.యాదగిరి ఆవిష్కరించారు. బహుభాషా కవి సమ్మేళనానికి అధ్యక్షులు, అరసం ఆం.ప్ర. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అంతర్జాతీయ కవి డా.పెరుగు రామకృష్ణ కవిని సమగ్రంగా పరిచయం చేశారు. ఈ బహుభాషా కవిసమ్మేళనంలో మైదవోలు వెంకటశేష సత్యనారాయణ, రాజేంద్రసింగ్ ఠాకూర్ ఆంగ్ల కవితలు వినిపించారు, కె.సంజీవరెడ్డి కన్నడ కవిత వినిపించగా, డా.వై.శైలజ హిందీ కవిత వినిపించారు. డా.మాడభూషి గారు మహాకవి భారతి రచించిన తమిళ కవిత మరియూ అనువాదం వినిపించారు. డా.పాతూరి అన్నపూర్ణ, డా.పెళ్ళూరి సునీల్, డా.పెరుగు రామకృష్ణ, డా.కె.కరుణశ్రీ, డా.టేకుమళ్ళ వెంకటప్పయ్య, నల్లు రమేష్ తమ తెలుగు కవితలను వినిపించి అలరించారు. కవులను సంచాలకులు మాడభూషి సంపత్‌కుమార్ ఘనంగా సత్కరించారు. అనంతరం వారం రోజులుగా వివిధ పాఠశాలలు, కళాశాలల్లో జరిగిన పోటీలలో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందించారు. డా.బడిగె ఉమేష్ వందన సమర్పణ గావించారు.

దేవులపల్లి రమేశ్ కు సాహిత్య పురస్కారం

హైదరాబాద్, డిసెంబర్ 13:(నేటినిజం ప్రతినిధి) తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, కణిక సాహిత్య, సామాజిక సేవ విద్యారంగ వేదిక హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో సాహిత్య సేవలు అందిస్తున్నందుకు సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం చెందిన కవి దేవులపల్లి రమేశ్,కు కణిక కుటుంబ ఆత్మీయ కలయిక,చెత్త బండి పుస్తక ఆవిష్కరణ సభలో సాహిత్య పురస్కారం లభించింది. కణిక అధ్యక్షురాలు రమదేవి కులకర్ణి, మేడ్చల్, జిల్లా, అదనపు కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి, డా, నాగేశ్వర శంకరం,నేటి నిజం పత్రిక సంపాదకులు బైసా దేవదాస్,ఐసం పూడి శ్రీ లక్ష్మి, సేనధీపతి, జయలక్ష్మి రవీంద్ర భారతి హైదరాబాదులో కవి దేవులపల్లి రమేశ్ ను సన్మానం చేసి అభినందించారు.దేవులపల్లి రమేశ్, మాట్లాడుతూ నా సేవను గుర్తించి నాకు సాహిత్య పురస్కారం లభించినందుకు చాలా ఆనందంగా ఉందన్నారు. సాహిత్య పురస్కారం లభించినందుకు కుటుంబ సభ్యులు కవులు అభినందించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్రం కాక ఇతర రాష్ట్రాలను పచ్చినటువంటి కవులు కళాకారులుతదితరులు పాల్గొన్నారు.

విద్యా సాధికారత జగన్ తోనే సాధ్యం : రాయలసీమ విద్యార్థి , యువజన సంఘాల జేఏసీ

అమరావతి, డిసెంబర్ 13:రాష్ట్రంలో విద్యా సాధికారత .. జగనన్నతోనే సాధ్యమని దిక్కులు పిక్కటిల్లేలా సంధ్యాల వేదికగా విద్యార్థి లోకం గొంతెత్తి నినదించింది. సంధ్యాల జిల్లా వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షులు సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవార